# మనుషులు - వ్యసనాలు

(వ్యాస సంకలనం)



సంపాదకత్వం

గౌరవ్ కళ్యాణి



ప్రచురణ

వ్యసన వ్యతిరేక
ప్రచార సమితి
ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ

# మనుషులు – వ్యసనాలు

(వ్యాస సంకలనం)


సంకలనం & సంపాదకత్వం

**గౌరవ్ కళ్యాణి**



ప్రచురణ

**వ్యసన వ్యతిరేక ప్రచార సమితి**

ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ

అక్టోబర్ 2, 2023



కాపీలెఫ్ట్

**సర్వహక్కులు సమాజానివి**


విజ్ఞప్తి

**ఇందులోని వ్యాసాల్లోని అభిప్రాయాలు అన్నిటితోనూ సంపాదకులు, ప్రచురణకర్తలు అంగీకరించాల్సిన అవసరం లేదు.**


మూల్యం

**అమూల్యం (సాఫ్ట్ కాపీ మాత్రమే)**



వివరాలకు

gouravmeka@gmail.com




## అంకితం

అందరికీ ఆప్తుడైన ప్రేమైక మిత్రుడు
చిరునవ్వుని ధరించిన నిత్యసంతోషి
ఎప్పుడూ సందాగా ఉండే శ్రేయోభిలాషి
అవాంఛిత వ్యసనాల బారినపడి
అన్యాయంగా అకాల మరణం చెందిన
బాల్య స్నేహితుడు, హితుడు, సృతుడు,
**"దేవరకొండ లక్ష్మీశ్రీనివాస్ (వాసు)"కి**
బాధాతప్త కన్నీటి హృదయంతో..

## ఒక మాట

వ్యసన వ్యతిరేక ప్రచార సమితికి పదేళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది రెండు పుస్తకాలను జేవీవీ, సహృదయ మిత్ర మండలి సంస్థల సహకారంతో ప్రచురించాం. ప్రతీ ప్రజాపక్ష ఉద్యమంతోనూ కలిసి నడవటం ఇంతకాలంగా మేం చేస్తోన్న పని.

అందులో భాగంగా ఒక మంచి మానవ సమాజం కోసం కృషి చేస్తున్న కొద్దిమంది సమష్టి ప్రయత్నాలపై గౌరవ భావనతో ఒకట్రెండు సేకరించిన వ్యాసాలు, పత్రికా వ్యాసాల్ని ఇలా చిరు పొత్తంగా కూర్చడం జరిగింది. హడావుడి వల్ల తలెత్తిన అచ్చు తప్పులు, సమన్వయ లోపాలకు క్షంతవ్యులం. మొత్తం వ్యవస్థే వ్యసనానికి వత్తాసు పలుకుతున్న అన్యాయ కాలంలో, ఆ అమానవీయతపై తిరుగుబాటు ఒక కనీస కర్తవ్యం.

దానిని బాధ్యతగా నిర్వర్తించడమే నవీన మానవుడి నైజం కావాలి. అందుకోసం చేసే ఎలాంటి రవ్వంత పనైనా అంతిమంగా జరిగే సామాజిక మార్పు క్రమంలో భాగమే.. ఈ చిన్న సంకలనం. మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో తనవంతు పాత్రను నిర్వహిస్తుందని ఆశిస్తున్నాం.

చివరగా ఇందులోని వ్యాసాలు వివిధ పత్రికల నుంచీ, సామాజిక మాధ్యమాల నుంచీ తీసుకోవడం జరిగింది. ఆయా మాధ్యమాలకు మా కృతజ్ఞతలు. అలాగే, కృతి మీ ముందుకు తీసుకు  రావడానికి అనుమతించీ, సహకరించిన వ్యాసకర్తలకూ, కంపోజింగ్‌కి తోడ్పడిన మిత్రులు శివప్రసన్న కుమార్ అవధూత, పాణంగిపల్లి శ్రీకాంత్ జయ శర్మ గారికీ హృదయ పూర్వక ధన్యవాదములు.

*విమర్శలకు ఆహ్వానం.*

### మద్యం కట్టడి కోసం

# మరో పోరాటం అవసరం



మనిషి ఆరోగ్యంగా ఎదగడానికి విష పూరితం గాని పౌష్టిక, వైవిధ్యమైన ఆహారం కలుషితం గాని తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలు, శాస్త్రీయ దృక్పథంతో ప్రకృతిని అర్థం చేసుకునే జ్ఞానం, సమస్య ఉమ్మడిగా పరిష్కరించుకునే పరస్పర సహకార – వ్యవస్థ, వీటిని బలోపేతం చేసే విధంగా ఉండే ప్రభుత్వ విధానాలు, కొన్ని స్పష్టమైన చట్టాలు, మార్గదర్శకాలు, అమలుకు కావాల్సిన నిధులు, మానవ వనరులు.. వన్నీ ఉంటే మాత్రమే మనుషులు ఆరోగ్యంగా. జీవించగలుగుతారు. ఇది జరగాలంటే రసాయన ఎరువులు, పురుగు విషాలు లేని సుస్థిర, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం రాష్ట్రమంతటా జరగాలి. ఇదొక్కటే కాదు, మద్యం, సిగరెట్లు, బీడీ, తంబాకు, గుట్కా, కల్తీ కల్లు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలపై నియంత్రణ ఉండాలి. ప్రజలు వాటికి దూరంగా ఉండాలి. ఇందు కోసం ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంస్థలు, ప్రజలు ఉమ్మడిగా కృషి చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ విన్న వెంటనే ఇది ఆచరణ సాధ్యం కాదు అనిపిస్తుంది కదూ? దానికి కారణాలు అనేకం. పేదరికం, నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు, ప్రజల సాంస్కృతిక జీవనం. బలహీనంగా స్థానిక పరిపాలనా వ్యవస్థలు, మద్యం ఆదాయంపై ఆధార పడుతున్న రాష్ట్ర బడ్జెట్‌లు, దీర్ఘకాలంగా ప్రజలో ఉన్న మద్యం అలవాట్లు, మద్యం కంపెనీలు, కల్తీ కల్లు ఉత్పత్తి, మార్కెటింగ్‌పై ఆధా రపడిన మాఫియా, కుటుంబాలు, అన్నిటినీ మించి మద్య నిషేధం సాధించి, అమలు చేయించుకోవడం సాధ్యం కాదని ముందే చేతులు ఎత్తేసిన సామాజిక, రాజకీయ శ్రేణుల వైఖరులు.. ఇవన్నీ కారణాలే...

### మద్యం పైసలతో పథకాలకు నిధులా?

తెలంగాణ వ్యవసాయ రంగంలో పురుగు, కలుపు విషాలు, రసాయన ఎరువులు ఎంత విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయో, సామాజిక, రాజకీయ రంగాల్లో మద్యం అంతే విధ్వంసాన్ని సృష్టిస్తున్నది. మునుగోడు ఎన్నికలో ఒక్క నియోజకవర్గంలో ఒక్క నెలలో రూ.300 కోట్ల విలువైన మద్యం ఏరులై పారిందంటే, పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



మద్యం కుటుంబాలను ఆర్థికంగా దివాళా తీయించడమే కాదు, ఆయా కుటుంబాల్లో హింసను పెంచుతోంది. వ్యక్తులను మృత్యువు వైపు నడిపిస్తోంది. రోడ్డు ప్రమాదాలకు, స్త్రీలపై హింసకు కారణమవుతోంది. ఏరోజు ఏ పత్రిక తిరిగేసినా, నేర ఘటనల వార్తల్లో మద్యం పాత్ర స్పష్టంగా కనపడుతోంది. వీటిని మించి మనిషి ఆలోచనా శక్తిని, విచక్షణా జ్ఞానాన్ని మద్యం చంపేస్తోంది. సమష్టితత్వాన్ని, ప్రజాస్వామిక విలువలను దెబ్బతీస్తోంది. ఇవాళ ఏ గ్రామం, పట్టణం, ఏ బస్తీలోనూ ప్రజలతో రాత్రిపూట సమావేశాలు జరపలేని పరిస్థితి ఉందని అందరూ అంటున్నారంటే దానికి ప్రధాన కారణం మద్యమే. అంటే ప్రస్తుతం కొనసాగుతున్నది మద్యం ఆధారిత సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థ మాత్రమే. అమలులో ఉన్నది అనాగరిక విలువలు మాత్రమే విషాదం ఏంటంటే మొత్తం దేశంలోనే ఈ మద్యం విషయంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండటం.

## కుటుంబాలు కూలుతున్నయ్..



సాధారణంగా మద్యంపై సమాజంలో చర్చ జరుగుతున్నప్పుడు కొన్ని తప్పుడు వాదనలు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా మద్యం తాగడం వ్యక్తిగత హక్కు కాబట్టి, దాన్ని నియంత్రించడం, నిషేధించడం వ్యక్తిగత హక్కుకు భంగకరమని వాదించే వాళ్లున్నారు. నిజానికి ఒక దుర్వ్యసనం వ్యక్తిగత హక్కు ఎంత మాత్రమూ కాదు. ఎందుకంటే, ఈ అలవాటు ఆవ్యక్తిని మాత్రమే కాదు. ఆ వ్యక్తి కుటుంబాన్ని, ముఖ్యంగా ఆయా కుటుంబాల మహిళల, పిల్లల భవిష్యత్తునూ చుట్టూ సామాజిక, రాజకీయ వాతావరణాన్ని విధ్వంసం చేస్తోంది. రాష్ట్రంలో 14 లక్షల మంది వితంతు మహిళలు ఉండటానికి ఈ మద్యం తనదైన పాత్ర పోషించింది. ఏ మహిళను కదిపి చూసినా మద్యం తమ కుటుంబాలకు ఎంత నష్టం చేస్తున్నదో స్పష్టంగా చెబుతారు. తెలంగాణ ప్రజల సంస్కృతిలో మద్యం ఒక భాగమని, దాన్ని నియంత్రించడం, నిషేధించడం ఈ సంస్కృతిపై దాడి అని వాదించే వాళ్లూ ఉన్నారు. తొలి నుంచి తెలంగాణ కుటుంబాల్లో(అన్ని కులాలలో కాదు) కల్లు తాగడం ఒక అలవాటుగా ఉన్న మాట వాస్తవం. కల్లు అంటే చెట్టు కింద కూర్చొని, కల్తీ లేకుండా తాగే నీరా. కానీ కల్లు పేరుతో ఇప్పుడు వ్యాపారులు అమ్ముతున్నది ఎంత మాత్రమూ కల్లు కాదు. అత్యంత ప్రమాదకరమైన మత్తు కలిగించే, ఆరోగ్యాన్ని పాడు చేసే పానీయం మాత్రమే. పైగా ఇప్పుడు వైన్స్ లో అమ్ముతున్నది, మొదటి నుంచి ప్రజల సాంస్కృతిక జీవనంలో ఉన్న కల్లు కాదు. అది కూడా మత్తు కలిగించే ప్రమాదకరమైన పానీయం మాత్రమే. వీటిని ప్రజల మీద రుద్దింది కేవలం వ్యాపారుల లాభాల కోసమూ, ప్రభుత్వాల పన్నుల ఆదాయం కోసమూ తప్ప.. తెలంగాణ సంస్కృతిని కాపాడటానికి కాదు.

తెలంగాణ ప్రభుత్వానికి 2014–15లో మద్యంపై వచ్చిన ఏక్సైజ్ పన్ను ఆదాయం రూ.2,823 కోట్లు కాగా, 2011–22 నాటికి ఇది రూ.20 వేల కోట్లకు చేరింది. ఈ పన్ను ఆదాయాన్ని రూ.25 వేల కోట్లకు తీసుకు వెళ్లాలని రాష్ట్రప్రభుత్వం ప్రణాళిక వేసుకుంటోంది. అంటే రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేండ్లలో ప్రభుత్వ ఎక్సైజ్ పన్ను ఆదాయం 8 రెట్లు పెరిగిందన్నమాట. రైతు బంధు(రూ.14 వేల కోట్లు), రైతు బీమా(రూ. 1300 కోట్లు), ఆసరా పెన్షన్లకు(రూ.10,000 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ఖర్చు మొత్తం రూ.25,000 కోట్లు కాగా, ఈ మొత్తాన్ని పూర్తిగా మద్యం తాగే వారి జేబుల నుంచే వసూలు చేస్తోంది. అంటే ప్రజల డబ్బులు ప్రజల చేతుల్లో పెట్టి, రాజకీయంగా టీఆర్ఎస్ పార్టీ ప్రయోజనం పొందుతోంది. ఇంతకంటే దారుణం ఇంకొకటి ఏముంటుంది?

## హర్యానా తరహా విధానం కావాలి

ఎప్పుడైనా, ఎవరైనా మద్య నిషేధం గురించి చర్చ ప్రారంభించగానే, దాన్ని వ్యతిరేకిస్తూ వాదనలు చేస్తున్నది ప్రభుత్వాలో వ్యాపారులో కాదు, కొంతమంది సోకాల్డ్ బుద్ధిజీవులే. ఈ పరిస్థితి మారాలి. 'మా ఆరోగ్యాలను పాడు చేసుకుంటాం, మా డబ్బులతో మేము తాగుతాం. అది మా హక్కు' అనేవాళ్ల కోణంలో నుంచి కాకుండా సమాజంలో అట్టడుగున ఉన్న పేదల, బలహీన వర్గాలు, శ్రమజీవుల కుటుంబాల భవిష్యత్తు నుంచి ఈ చర్చ ఎక్కువ జరగాలి. తమ తప్పుడు విధానాలను, అవినీతిని ప్రజలు ఎప్పుడూ ప్రశ్నించ కుండా ఉండాలని ప్రభుత్వాలు కోరుకుంటాయి. కానీ ప్రజలు చైతన్యవంతులు కావాలి. ప్రశ్నించే స్వభావాన్ని కలిగి ఉండాలని కోరుకునే వాళ్లు మాత్రం రాష్ట్రంలో పెరుగుతున్న మద్యం వ్యసనంపై మాత్రం చర్చ కొనసాగించాలి.

కొన్ని రాష్ట్రాల్లో మద్యం నిషేధించారు. కొన్ని మంచి ఫలితాలు ఉన్నాయి. కొన్ని పొరపాట్లు కొనసాగుతున్నాయి. సాధించిన సానుకూల ఫలితాలను ప్రచారం చేస్తూనే, ఆయా ప్రభుత్వాలు మద్య నిషేధానికి తూట్లు పొడవడానికి చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టాలి. మద్యం పూర్తిగా నిషేధించకుండా దాన్ని ప్రజలకు అందుబాటు నుంచి తొలగించకుండా, కేవలం కొద్దిపాటి నియంత్రణతోనే లేదా ప్రచారంతోనే ఈ అలవాటును మాన్పించగలుగుతామని అనుకోవడా నికి లేదు. కనీసం 'మద్య నియంత్రణతో ప్రారంభించి, నిషేధం వైపు ప్రయాణం ప్రారంభించాం.. అనే మార్మోగాలి. నిషేధం తప్పకుండా అవసరమని మహాత్మాగాంధీ 1930 లోనే స్పష్టంగా ప్రకటించారు. ప్రభుత్వాలకు మద్యనిషేధం అమలు పట్ల రాజకీయ చిత్తశుద్ధి ఉంటే, పార్టీలకు, సామాజిక సంస్థలకు నిజంగా ప్రజల పట్ల బాధ్యతగా దీన్ని అమలు చేయించుకో వాలనే పట్టుదల ఉంటే, ఇది ఎంత మాత్రమూ అసాధ్యం కాదు. రాష్ట్రం మొత్తంలో కాకుండా, మద్యం ఉత్పత్తిని, అమ్మకాలను నిషేధించుకునే అధికారం గ్రామ పంచాయతీలకు కట్టబెడుతూ హర్యానా ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఒక చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం గ్రామసభలో 10 శాతం జనాభా మద్యం అమ్మకాలు వద్దని తీర్మానం చేస్తే సరిపోతుంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇలాంటి ప్రయత్నంతో ఒక మార్గం చేయవచ్చు. అనుభవాల నుంచి నేర్చుకుని ముందుకు పోవచ్చు.



**కన్నెగంటి రవి**
రైతు స్వరాజ్య వేదిక,
హైదరాబాద్

# తెలంగాణ అంటే తాగుడేనా!?



తాగుడు తప్పుకాకపోవచ్చు గానీ తాగడమే జీవితం కాదు గదా! ఆనందం అంటే మందు తాగడం అన్నంత కన్పిస్తుంది కొన్ని సినిమాల్లో! తెలంగాణ భాష సంస్కృతులతో సినిమాలు పాటలు ఇటీవల కాలంలో విస్తృతంగా వస్తున్నవి. వాటిని తెలంగాణే కాదు. తెలుగు దేశమంతా ఇష్టంగా చూస్తున్నారు. కానీ ఇటీవల వస్తున్న కొన్ని సినిమాల్లో మందు తాగడమే ప్రధానంగా కన్పిస్తుంది. పాటల్లో, ఫైటింగ్లో ఎక్కడ పడితే అక్కడ తాగుడు సన్నివేశం పెట్టారు. తెలంగాణ నేటివిటితో వచ్చే సినిమాల్లో ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ తాగడం, సందర్భం లేకున్నా మందులో మునిగిపోవడం చూస్తుంటే ఈ సినిమావాళ్లు.. తెలంగాణ అంటే 'తాగుడు' అనే పరిచయం చేస్తున్నారా? అనిపిస్తోంది. ఇటీవల రెండు మూడు సినిమాలో ఇలానే కనిపించింది. సింగరేణి నేపథ్యంలో తీసిన సినిమాల్లో దీన్ని మరీ అతిగా చూపించారు.

## ఎక్కడ పడితే అక్కడ దొరకడంతో...

సింగరేణి.. అన్ని ప్రాంతాల నుంచి వలస వచ్చిన గ్రామీణ శ్రామికుల ప్రాంతం. యాభై ఏండ్లుగా సింగరేణి కార్మికుల కుటుంబాల నుంచి ఎందరో ఉన్నత విద్యావంతులై జీవితంలో స్థిరపడిపోయారు. శ్రామికవర్గ చైతన్యంతో ప్రశ్నించే, తిరుగుబాటు చేసే సామాజిక రాజకీయాలను అర్థం చేసుకునే తరం అక్కడ నుంచి ఎరిగింది. కళా సామాజిక సాహిత్య రంగంలో కూడా సింగరేణి బెల్ట్ తక్కువదేమీ కాదు. అట్లాంటి ప్రాంత నేపథ్యంలో సినిమా అంటే అంతరంగం మద్యమే అన్నట్టుగా ఉండటం లేని సంస్కృతిని తెలంగాణకు అపాదించినట్టు కన్పిస్తోంది. మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే 'తాగడం' అనేది ఇటీవల కాలంలో లెక్కలు చూస్తే ఇక్కడ కొంత ఎక్కువైనట్టుంది. ఇది కూడా భవిష్యత్‌కు ప్రమాదకరమైనది. ప్రతి ఊరిలో అనుకూలంగా బెల్ట్ షాపులు నగరాల్లోనూ, ఎక్కడపడితే అక్కడ వైన్ షాపులు వెలిశాయి. ఇందుకు తోడు ఎక్సైజ్ శాఖకు అమ్మకాలు ఎక్కువ జరిపేందుకు టార్గెట్లు పెట్టడం దారుణంగానే ఉంది. విపరీతంగా తాగడం వల్ల రోడ్డు ప్రమాదాలు, కొట్లాటలు అనారోగ్యాలకు ప్రజలు గురవుతున్నారు. ఎక్కడికక్కడ డబ్బులు దుర్వినియోగం అవుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ సరుకు అందుబాటులో ఉండటం వల్ల మనసు అటే 'గుంజే' ప్రమాదం ఉంది.

## సినిమాను..

## ఒక్క కల్చర్కు కట్టి చూపొద్దు

తాగుడు ఇప్పుడు విద్యార్థుల వరకు పాకిపోయింది. టెన్త్, ఇంటర్మీడియట్ పిల్లలు కూడా చుట్టూ సమాజాన్ని చూసి ఫ్యాషన్గా మొదలుపెట్టి అలవాటుగా మార్చుకుంటున్నారు. సరిగ్గా ఈ సందర్భంలోనే తెలంగాణ భాష సంస్కృతిలో వస్తున్న సినిమాల్లో తాగడం ఒక ప్రధానం చేయడం వల్ల మారాల్సిన సమాజం మరింత కొనసాగిస్తోంది. ఒకప్పుడు కొన్ని సినిమాల్లో రాయలసీమ అంటే ఫ్యాక్షనిస్టు అన్నట్టు చూపించే వాళ్లు. పగలు, పంచాయితీ, ఫ్యాక్షన్ రాజకీయాలు, చావులు ఇవన్నీ హీరోయిజంగా వచ్చిన సినిమాలు చూస్తే రాయలసీమ అంటే మొత్తం ఫ్యాక్షన్ సంస్కృతిలా అనుకునేట్లు అయింది. సమాజంలో ఎన్ని కథలు, జీవితాలు ఉంటాయి. పేదరికం, మోసాలు, వలసలు, వ్యవసాయంలో నష్టపోవడం, పోరాటాలు, ప్రేమలు ఎన్ని ఉంటాయి. అందులో ఫ్యాక్షన్ ఒకటి కావచ్చు గానీ, అట్లనే తెలంగాణ సినిమాను కూడా ఒక్క కల్చరు కట్టి చూపెట్టడం తగదు.



**అన్నవరం దేవేందర్**
జర్నలిస్ట్, కరీంనగర్
(దిశ దినపత్రిక 'అంతరంగం' కాలమ్ నుంచి)

## మద్యపాన నిషేధం

# ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి !!!



మద్యపానం మానవత్వాన్ని దిగజారుస్తున్న సమాజంలో ఈరోజు మనం ఉన్నాం. రోజూ మద్యం తాగి ఒళ్లు గుల్ల చేసుకుంటున్న అనేక మంది శ్రమజీవులు, వారి రక్తాన్ని ఈ భయంకర దురలవాటుకి ధారపోస్తున్నారు. ఎంతోమంది యువత ఆధునికత పేరిట తాగడానికి అలవాటు పడి చిన్న వయసులోనే దీర్ఘకాలిక రోగాలకు బలవుతున్నారు. తాగిన మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రతీరోజూ అయినవారికి తీరని దుఃఖాన్ని మిగిల్చేవారు ఎందరో.

ఇక మద్యం మత్తులో జరిగే నేరాలు, ఘోరాలకు లెక్కేలేదు. ముఖ్యంగా స్త్రీల పట్ల ప్రతి నిత్యం జరిగే దాడులు, వేధింపులు, అత్యాచార నేరాల్లో కచ్చితంగా మద్యం పాత్ర ప్రధానంగా ఉంటుంది. అలాగే బాలకార్మిక వ్యవస్థకి ఒక మూలకారణం మద్యమనే విషయం అందరికీ తెల్సిందే. అందుకే, మనుషుల్ని మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా, సాంఘికంగా, లైంగికంగా అన్ని విధాలా దిగజార్చే మద్యం మత్తును స్వచ్ఛందంగా విడనాడటమే వ్యసనరహిత వ్యవస్థ నిర్మాణానికి మొదటి మెట్టు కాగలదు.

పౌరుల బలహీనతల్ని లాభసాటి ఆదాయ వనరులుగా చూసే ప్రభుత్వాలు ఇకనైనా కళ్లు తెరిచి, ఆర్థికత కంటే ఆరోగ్యం ప్రధానమని గుర్తించాలి. బడుగు బలహీన వర్గాల జీవితాల్లో నిత్యం చిచ్చు పెట్టే మద్యాన్ని సమూలంగా నిర్మూలించకుండా ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా వృథా అనే నిజాన్ని పాలకులు గ్రహించాలి. ముఖ్యంగా మద్యపాన మత్తులో జోగడం అనైతికతకి చిహ్నం కానీ అది ఆధునికత కాదనే భావం సమాజంలో, ముఖ్యంగా యువతలో బలంగా ఏర్పరచాలి. అసంఖ్యాక మంది పేదలకు కనీస అవసరాలు కూడా తీర్చలేని వ్యవస్థలో, వ్యసనాలనేవి సాంఘిక ద్రోహమనే దృక్పథం సర్వత్రా ఏర్పడాలి.

అందుకోసం విద్యార్థి దశలోనే వ్యసనాల పట్ల సరైన అవగాహన కల్పించాలి. ఈసరికే మద్యం ఇతరేతర వ్యసనాల బారిన పడిన వారూ, ముఖ్యంగా యువతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. డీ అడిక్షన్ సెంటర్ల సంఖ్య పెంచాలి. ప్రభుత్వ వైద్యులు, అధికారులు విద్యాసంస్థలు, కళాశాలల్లో తరచుగా వ్యసనాల్ని స్వచ్ఛందంగా విడనాడేలా విద్యార్థులకు అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్

కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతీ గ్రామ/వార్డు సచివాలయం లోనూ ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఉంచాలి. అలాగే, కనీసం నెలకోసారి పోలీస్/ హెల్త్ వర్కర్‌ల ద్వారా సచివాలయాల పరిధిలో చిన్న అవగాహన సదస్సు/ చర్చా గోష్టి వంటివి నిర్వహించాలి.

మద్యం ఉత్పత్తిలో భాగమైన సామాన్య ప్రజలకి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించకుండా, మద్యం తయారు చేసే కంపెనీలని తొలగించకుండా, మద్య నిషేధం అమలు కాదు. ఆ దిశగా పాలకులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆదర్శవంతమైన సమాజం సమష్టి కృషితోనే సాధ్యం. కాబట్టి, మద్యపాన నిషేధం కేవలం ఏ ఒక్కరికో సంబంధించిన అంశం కాదు. సమాజం బాగుండాలని ఆశించే ప్రతిఒక్కరూ కుల, మత, లింగ, ప్రాంతాలకు అతీతంగా అన్ని రాజకీయ సామాజిక సాంస్కృతిక వేదికలూ, స్వచ్ఛంద సంస్థలూ కలిసికట్టుగా ఒక్కటై మన భావితరాల కోసం సమష్టిగా సాధించుకోవాల్సిన ఆదర్శం.

రండి... మంచి మానవ సమాజం కోసం అందరం కలిసి ముందడుగు వేద్దాం! మద్యనిషేధం వెంటనే అమలు చేయమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేద్దాం!!



**దాడి గంగాధరరావు**
ఏలూరు

# మద్యనిషేధ ఉద్యమం

భారతదేశ స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15న సిద్ధించినా.. మద్యపానం కారణంగా గ్రామీణ ప్రజల మీద ఆర్థిక, నైతిక, ఆరోగ్య సమస్యలు ఏర్పడి గ్రామాలు నిర్వీర్యం అయిపోతున్నాయి. ఈ తాగుడు దుర్వ్యసనాలకు అంతా దూరంగా ఉండాలని ఆశిస్తూ ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నా గీత కార్మికులకు ప్రత్యమ్నాయమైన మార్గాల ద్వారా ఆర్థిక వనరులు కల్పించాలని ఆశించారు. గుజరాత్, మద్రాసు, మహరాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో మద్యనిషేధ చట్టం ఆ రాష్ట్ర ప్రభుత్వాల శాసనసభల్లో చట్టాలు చేసి, అమలు పరిచేందుకు యంత్రాంగాన్ని నియమించడం జరిగింది.



మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్న ఆంధ్ర రాష్ట్రాంలో మద్యపాన నిషేధ చట్టం అమలులోకి వచ్చి ఉంది. ఈ మద్యపాన నిషేధ చట్టం వల్ల గీత కార్మికులకు జీవనోపాధి కల్పించాలని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం 1953 ఏర్పడి, ఆంధ్ర రాష్ట్రానికి ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీ గౌతు లచ్చన్న గారి పర్యవేక్షణలో గీత కార్మికులు సత్యాగ్రహాలు ప్రారంభించి, వేల సంఖ్యలో జైలుకు వెళ్లారు.

కమ్యూనిస్టు పార్టీ, కృషీకార్ లోక్ పార్టీలు, శాసన సభలో ప్రజా సోషలిస్టు పార్టీలో ఉన్నా.. సోషలిస్టు పార్టీ శాసనసభ్యులు శ్రీ పీవీజీ రాజు(విజయనగరం రాజు) వర్గం విడి వడి ఉంది.

కాంగ్రెస్ ప్రజా సోషలిస్టు ప్రకాశం గారు వర్గం కలిసి ఏర్పాటు చేసిన ఈ మైనార్టీ ప్రభుత్వం సంఖ్య బలంలో సరిసమానంగా ఉన్నా మనుగడ సుసాధ్యమైంది. 1953 అక్టోబర్ 1న ఏర్పడిన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం.. 11 నెలలు శ్రీ ప్రకాశం గారి నాయకత్వంలో పని చేసిన ఈ ప్రభుత్వం, మద్య నిషేధం సమస్యపై అవిశ్వాస తీర్మాణం ఫలితంగా రాజీనామ చేయాల్సి వచ్చింది. తిరిగి శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ శాసనసభ స్థానాలు సాధించి శ్రీ నీలం సంజీవరెడ్డి, శ్రీ బెజవాడ గోపాల్‌రెడ్డి నాయకత్వంలో మంత్రి వర్గం ఏర్పాటుచేసి పరిపాలన కొనసాగించారు. 1956 నవంబర్ 1న భాషా ప్రయుక్త రాష్ట్రం అవతరించిన సమయంలో హైదారబాద్ రాష్ట్రంలో తెలంగాణలోని 11 జిల్లాలు ఆంధ్రరాష్ట్రంలో కలిసి..

ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది.

సమయంలో హైదరబాద్ రాష్ట్రంలో మద్యపాన నిషేధ చట్టం అమలులో లేనందున మునగాల పరగాలో ఉన్న 18 గ్రామాలు కృష్ణ, నల్గొండ, జిల్లాల మధ్య ఉన్న ఈ గ్రామాలు మద్రాస్ రాష్ట్రం, ఆ తదుపరి ఆంధ్ర రాష్ట్రములో న్న ప్రాంతం చుట్టూ నైజాం రాష్ట్రం అయినందున ఈ మునగాల పరగాలో అమలులో ఉన్న మద్యపాన నిషేధ చట్టం అమలు కాకుండా, ఆంధప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ప్రకటించి కల్లు, సారా దుకాణాలను తెరుచుటకు వేలంపాట నిర్వహించడం జరిగింది. ఇంతకు ముందు మద్య నిషేధ చట్టం అమలులో ఉన్న దానిని తొలగించిన్నందుకు గాను గాంధేయవాదులు దండి సత్యాగ్రాహి శ్రీసాధు సుబ్రహ్మణ్యం గారు తీవ్ర నిరసన తెలియజేస్తూ మద్యనిషేధం అమలు చేయాల్సిన ఈ ప్రభుత్వం కల్లు, సారా దుకాణం ద్వారా ఆదాయ వనరులు పొందుట అన్యాయమని.. మునగాల పరగణ గ్రామంలో పర్యటించి మద్యపాన నిషేధంపై ప్రచారం చేస్తూ గ్రామాల్లో ప్రజలను చైతన్యం పరుస్తూ కల్లు, సారా దుకాణాలు తెరువకుండా నిషేధించడం జరిగింది. ఈ సందర్భంలో రేపాల గ్రామ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో కోదాటి నారాయణరావు నాయకత్వంలో సత్యాగ్రహ కార్యాక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ మద్య నిషేధ చట్టం అమలు చేయాలని, దీనికి తగిన ఉద్యమం రూపొందించుట జరిగింది. శ్రీ ఉమెత్తల కేశవరావు గారు, శ్రీ బీఎస్‌సీ రంగారెడ్డి, శ్రీ ప్రభాకర్‌జీ, శ్రీ కోదండరాంరెడ్డి, శ్రీ సీవీ చారి తదితర సర్వోదయ స్వాతంత్ర్య సమరయోధులు రేపాల సమావేశంలో పాల్గొన్నారు. 1957లో ఈ ఉద్యమం సాదు సుబ్రహ్మణ్యం గారి సారధ్యంలో పాదయాత్ర నిరసన ప్రదర్శనలు గాంధేయవాదులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నందున ప్రజా ఉద్యమంగా రూపొందింది. వార్ధా, సేవగ్రాం ఆశ్రమం నుంచి శ్రీప్రభాకర్‌జీ సాధు సుబ్రహ్మణ్యం గారు పాదయాత్రను పర్యవేక్షిన్తుండేవారు. తెలంగాణలో పాదయాత్ర అన్ని జిల్లాల్లో చేస్తున్న శ్రీ సాధు సుబ్రహ్మణ్యం గారు.. 'రాజకీయ నాయకులకు ముఖ్యంగా కల్లు, సారా, వ్యాపారంతో వచ్చే ఆదాయంతో ప్రభుత్వం నడుస్తోంద'ని బహిరంగంగా విమర్శించారు. 'గాంధేయవాదులుగా చెబుతున్న ఈ కాంగ్రెస్ నాయకుల మద్య నిషేధ చట్టాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు నిర్లక్ష్యం చేస్తున్నా'రని తూర్పారబట్టారు. తన చివరి మజిలీ నిజామాబాద్ జిల్లా కోటగిరి గ్రామంలో పాదయాత్రను ముగించి, ఆమరణ నిరాహార దీక్షకు ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు. అందుకు తగిన ఏర్పాటు చేసి పూనుకున్న సమయంలోనే శ్రీ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష కారణంగా చోటుచేసుకున్న పరిణామాలు, అదే సందర్భంలో ప్రముఖ గాంధేయవాది దాడి సత్యగ్రహి శ్రీ సాధు సుబ్రహ్మణ్యం గారి నిరసనలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇవన్నీ నిరాహర దీక్షకు ఉపక్రమిస్తున్నాయని గ్రహించిన అప్పటి ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య గారు విషయాన్ని అధిష్టానానికి వెంటనే తెలియజేశారు. అనంతరం అంచెల వారిగా మద్య నిషేధం అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని, గాంధీజీ ఆశయాలను

తప్పక అమలు చేస్తామని ప్రకటించారు. వెంటనే నిరాహార దీక్ష విరమించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ శ్రీ ప్రభాకర్‌జీ, శ్రీ సీవీ చారి, రాష్ట్రప్రభుత్వ అదనపు కార్యాదర్శి మరియు డీఐజీ తదితర పోలీసు అధికారులను శ్రీసాధు సుబ్రహ్మణ్యం గారిని కలిసేందుకు కోటగిరి పంపడం జరిగింది.

ఈ సమయంలో నేను కూడా శ్రీ ప్రభాకర్‌జీ వెంట ఉన్నాను. ఈ విధంగా మద్య నిషేధ ఉద్యమం జరిపిన శ్రీ సాధు సుబ్రహ్మణ్యం గారు పట్టుదల మరోసారి నిరూపితమైంది. ఈ ఉద్యమం నడుస్తున్న సమయంలోనే గీత కార్మికులకు జీవనోపాధి కల్పించేందుకు ఖాదీ కమిషన్ ద్వారా గజానన నాయక్(బొంబాయి) మార్గ దర్శకంలో నీరాతో పాటు చక్కెర, బెల్లం తయారు చేసే పరిశ్రమలను ప్రోత్సహించాలని ఉద్దేశించారు. శ్రీ చూండి జగన్నాథం గారు భూదాన్ పోచమ్‌పల్లిలో ఈ పరిశ్రమ శాఖ ద్వారా ఉత్పత్తి అయ్యే నీరా విక్రయ కేంద్రాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పి (ప్రతిరోజు ఉదయం) నిర్వహించారు.
దీని కారణంగా ఈ పరిశ్రమ ద్వారా ఎంతోమందికి జీవనోపాధి లభిస్తుంది. చెక్కర, బెల్లం కూడా నిత్యావసర వస్తువుల ఉత్పత్తికి దోహదపడుతున్నందున తాటి, ఈత చెట్లు, వాటి వనాలను పెంచి ఆదాయ వనరులుగా మార్చే ప్రయత్నం జరిగింది. ఆంధ్రప్రదేశ్ మద్య నిషేధ మండలి ద్వారా శ్రీ సాధు సుబ్రహ్మణ్యం, బీసీహెచ్ రంగారెడ్డి గారు ప్రభుత్వ సహకారంతో విస్తృత కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. డాక్టర్ మీర్ అక్బర్ అలీఖాన్(మాజీ గవర్నర్) పండిట్ నరేంద్రజీ, శ్రీమతి టీఎన్ సదాలక్ష్మి (మంత్రి) మద్య నిషేధ సమ్మేళనంలో ఆర్‌కే రామ్ సారధ్యంలో పెండెకంటి వెంకట సుబ్బయ్య గారు (కేంద్రమంత్రి) అధ్యక్షతన అహోబిలం క్షేత్రంలో రెండురోజులు పాటు నిర్వహించారు. కార్యనగర్‌లో శ్రీ బోయనపల్లి వెంకట రామారావు సారధ్యంలో పండిట్ నరేంద్రజీ, స్టేట్ ఖాదీ బోర్డు అధ్యక్షుడు మద్య నిషేధ సమ్మేళనాన్ని ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ లో శ్రీ మహేంద్రనాథ్ గారి సారధ్యంలో జరిగిన మద్య నిషేధ సమేళనానికి శ్రీమతి టీఎన్ సదాలక్ష్మి, పండిట్ నరేంద్రజీ, శ్రీ సాధు సుబ్రహ్మణ్యం గారు, శ్రీ ప్రభాకర్‌జీ తదితరులు హాజరై, విజయవంతం చేశారు. శ్రీ ఉమ్మెత్తల కేశవరావు శ్రీ గామోజీ మణిక్యంరావు, శ్రీ చుండి జగనాథం, శ్రీ ప్రభాకర్‌జీ, శ్రీ సీవీ చారీ గార్లు నియమ, నిబంధనలు ఏర్పాటు చేసి, దీని ద్వారా వివిధ జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించారు. ఈ సంస్థకు కార్యదర్శిగా నేను సేవలు అందించడం జరిగింది.

శ్రీ బీసీహెచ్ రంగారెడ్డి, శ్రీ ఎం.సుర్యారావు, శ్రీ సాధు సుబ్రహ్మణ్యం గార్లు వెన్నెంటే ఉండి రాష్ట్ర మద్య నిషేధ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి నిజాం ట్రస్ట్ అర్థిక సహకారంతో కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అఖిల భారతస్థాయిలో రూప్ నారాయణ ఆధ్వర్యంలో శ్రీ భక్తవత్సల, శ్రీ సుశీలనాయర్(డాక్టర్స్), శ్రీ మొరార్జీ దేశాయ్‌ల నాయకత్వంలో ఏర్పడిన సంఘం.. సంపూర్ణ మద్య నిషేధం కోసం విస్తృత స్థాయిలో ప్రచార సమితి సిద్ధం చేస్తూ భారత మద్య నిషేధ సమ్మేళనం వివిధ రాష్ట్రాల్లో

నిర్వహించడం జరిగింది. ఇందులో మద్య నిషేధం అమలు చేయాలని ఆశించిన మద్రాస్ రాష్ట్రం రాజాజీ తర్వారా అన్నా దొరై హాజరై, ముఖ్యమంత్రులుగా నిష్టతో మద్య నిషేధం అమలు చేయుటకు పునుకొని అఖిల భారత మద్యనిషేధ సమ్మేళనాన్ని మద్రాస్‌లో నిర్వహించి దేశంలో గాంధేయవాదులను ఆశ్చర్యచకితులను చేశారు. ఈ దుర్వ్యసనాలకు అలవాటు పడి ఉన్న ఎన్నో కుటుంబాలు వీధిపాలయ్యాయి. కల్లుతాగి ప్రతి సంవత్సరం అన్ని రాష్ట్రాల్లో వందలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. తాగిన వ్యక్తి నేర ప్రవృత్తికి దిగి ఎన్నో నేరాలకు కారణమవుతున్నాడు.

దిగువ, మధ్య తరగతి ప్రజల పాలిట ఈ మద్యపానం రాకాసిగా విలయతాండవం చేసి, నైతిక విలువలు, మానవత్వాన్ని నాశనం చేస్తోంది. యువత మత్తు పానీయాలకు అలవాటు పడి, ఇదే నాగరికత అనే దుష్ట సంప్రదాయానికి వస్తూ.. దేశ, విదేశాలోల్లో విచక్షణా రాహిత్యంగా వాహనాలను నడిపి ప్రమాదాల పాలిట పడి చనిపోతున్నారు. నేడు సినిమాలు, టీవీ సీరియల్‌లో ఈ తాగుడును చూపిస్తూ ప్రజలు ముఖ్యంగా మానసికంగా పక్కదారి పట్టి స్తున్న వాటిని ప్రభుత్వం వెంటనే నిషేధించాలి సెంచార్ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఎన్నికల సమయంలో ఈ తాగుడు ఏరులై పారుతుందనేది జగమెరిగిన సత్యం. ఎన్నికల కమిషన్, యంత్రాంగం ఈ మహమ్మారిని దరికి చేరకుండా ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలి. విధానాలను అవలంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. గోడలపై, వీధులపై అభ్యర్థుల ప్రచార రాతలను ఎన్నికల కమిషన్ సంస్కర్త శ్రీ టీఎన్ శేషన్ ఏ విధంగా అయితే నిషేధించారో.. అదే విధమైన నిబంధన మద్య నిషేధంపై కూడా విధించడం సమంజం కాగలదని ఆశిస్తున్నాను. 'భారత దేశ సార్వ భౌమాధికారము ఒక రోజు నాకు సంక్రమించిన ఎడల సంపూర్ణ మద్య నిషేధ చట్టము అమలు చేస్తాను. అలాగే ఈ వ్యాపారంపై ఆధారపడిన వారికి ఎటువంటి నష్ట పరిహారం కూడా చెల్లించాల్సిన అవసరం లేదని జాతిపిత మహాత్మా గాంధీజీ అభిప్రాయం వెలువరించారు.



**సర్వోదయ సుబ్బారావు**
నాగర్ కర్నూల్

# జీవితనాశిని పోర్నోగ్రఫీ

పోర్న్ చిత్రాలు చూసేవారు తమవారికి క్రమంగా దూరమవుతూ ఒంటరితనానికి అలవాటు పడతారు. ఎక్కువ సమయం పోర్న్ చూడటానికే వెచ్చిస్తారు. జీవిత భాగస్వామిపై అభిమానం, ఆప్యాయతకి బదులుగా అనుమానం పెంచుకుంటారు. పదే పదే గొడవలు, గాయపరిచే సంఘటనలు జరిగే అవకాశాలు ఎక్కువ. దీనిని మాన్పించకపోతే మరింత క్రూరంగా, జుగుప్సాకరంగా నిర్ఘాంతపోయేంత అమానవీయంగా మారుతూ ఎందుకూ కొరగాకుండాపోతారు. వ్యక్తిగత జీవితం, కుటుంబ జీవితం, వృత్తి జీవితం దెబ్బతింటుంది.



పోర్న్ పురుషులను విచక్షణ లేని కాముకులుగా మార్చే ప్రమాదం ఉంది. దాంపత్య జీవితాలను ధ్వంసం చేస్తోంది. వివాహేతర సంబంధాలకు దారితీసి సంసారాలకు హాని చేస్తోంది. సెక్స్ అనేది సహజ కోరికే. అలాగని దానిని అపరిమితం చేయలేం. వయస్సు హార్మోనుల ప్రభావాన్నీ కాదునలేం. మహిళలు, పురుషుల సంబంధాల సాధారణ జీవ చక్రానికి విఘాతం కలిగిన సమాజంలో మనం ఇప్పుడు జీవిస్తున్నాం. గతంలో పురుషులు 21-22 సంవత్సరాలలో వివాహం చేసుకునేవారు. ప్రస్తుతం 30 ఏళ్లు ప్రారంభంలో చేసుకుంటున్నారు. ఆడపిల్లలకు 18 యేళ్లకే పెళ్లిళ్లు జరిగేవి. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాతనే జరుగుతున్నాయి. అశ్లీలం, హింస పెరగడానికి ఇలాంటి ఆధునిక మార్పులు చేర్పులు కూడా తోడవుతున్నాయి. టీనేజర్లు, యువతీ, యువకులు, మధ్య మయస్కులు, ముసలివారు, ఇలా స్మార్ట్ ఫోన్ చేతిలో ఉన్న కోట్లాది మంది పోర్న్ వీడియోలను నిస్సిగ్గుగా వీక్షిస్తున్నారు. నెట్ ఓపెన్ చేయగానే కొన్ని వందల సైట్లు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. చాలా దేశాలలో వీటిపై నిషేధం, నియంత్రణలు లేవు. కొన్ని దేశాలు వయసు నియంత్రణ విధించగా, మరికొన్ని దేశాలు వాటికి ఫైర్ వాల్స్ నిర్మించుకొని, అనుమతులిస్తున్నాయి. నేడు పోర్నోగ్రఫీ ఇంటర్ నెట్‌లో మిలియన్ డాలర్ల భారీ వ్యాపారంగా విరాజిల్లుతోంది. సెక్స్ కోరికలను సంతృప్తిపరిచే విధంగా మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది.

**టాప్ దిశగా భారత్ అడుగులు**

పోర్న్‌లు సందర్శించడంలో యూఎస్, బ్రిటన్ తర్వాత కెనడాను వెనుకకు నెట్టి భారత్ మూడో స్థానానికి చేరుకుంది. ఈ వీడియోలు చూసే.. యూఎస్, బ్రిటన్‌వాసుల సగటు సమయం 11 సెకన్లు కాగా, భారత్‌లో 9.30 నిమిషాలుగా ఉంది. ఆగస్ట్ 2022లో భారతీయులు ఈ సైట్‌లను మూడు బిలియన్ల కంటే ఎక్కువ మంది సందర్శించారు. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఈ సంఖ్య 73 శాతం అధికం.

నెట్ వెబ్‌సైట్ ట్రాఫిక్‌లో పోర్నోగ్రఫీ ట్రాఫిక్ 30శాతం నుంచి 70శాతం వరకు ఉంటోంది, ఇది టెలికాం కంపెనీలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. కోవిడ్ కాలంలో మొదలైన పెరుగుదల ఎంతవరకు దారి తీస్తుందో చెప్పడం అసాధ్యం. అత్యాచారం, పిల్లలపై వేధింపుల వీడియోలను తీసివేయడానికి పోర్న్ హబ్ నిరాకరించడాన్ని – బహిర్గతం చేస్తూ నికోలస్ క్రిస్టోఫ్ డిసెంబర్ 2020లో న్యూయార్క్ టైమ్స్‌లో రాసిన కథనం అంతర్జాతీయగా సంచలనం రేకెత్తించింది. అప్పటి నుంచి మాస్టర్, వీసా వంటి క్రెడిట్ కార్డ్ కంపెనీ మాంట్రియల్ ఆధారిత సైట్‌తో సంబంధాలు తెంచుకున్నాయి. పోర్న్ పూర్తిగా ప్రభుత్వాలు నిషేధించాలా? వద్దా? అనే చర్చలో ఆర్థిక సంస్థలు భాగమయ్యాయి. వాస్తవానికి 93శాతం మంది పురుషులు, 62శాతం మంది విద్యార్థినులు 18 ఏళ్లు నిండకముందే పోర్న్ చూస్తున్నారు.

## లేత శరీరాల భారీ పెట్టుబడి



పోర్నోగ్రఫీకి మొందటగా బలవుతున్నది అమాయక చిన్నారులు. సెక్స్ వర్కర్లు, డ్రగ్స్‌కు అలవాటుపడిన యువతను బలవంతంగా ఈ కూపంలోకి దించుతున్నారు. పిల్లలు పాత్రధారులు మాత్రమే. భారీగా డబ్బులు ఆశ చూపి వ్యభిచార రొంపిలోకి చేర్చడం అనాగరిక సంస్కృతిని సమర్థంచేలా ఉంది. దీన్నంతా భావ ప్రకటనా స్వేచ్ఛగా, వ్యక్తిగతంగా ఎంపిక చేసుకొనే అవకాశంగానే చూడాలనడం ఎంతవరకు సబబో ప్రజాస్వామ్య ప్రియులు ఆలోచించాలి. పిల్లలతో లైంగిక చర్యలు.. వావి వరుసలు లేకుండా, సమాజం తలదించుకునే విధంగా రక్త సంబంధీకుల మధ్య శారీరక సంబంధాల చిత్రాలు, భిన్న వయసుల వారి మధ్య సంబంధాలు, సేమ్ జెండర్లో సంబంధాలు, ట్రాన్స్ జెండర్ మధ్య సంబంధాలు, రక్తసిక్త అత్యాచారాల చిత్రాలు, సామూహిక లైంగిక చర్యలు, శవాలు, జంతువులతో అనైతిక అనాగరిక చిత్రాలు ఉంటున్నాయని.. 'పోర్న్ దాని ఫలితాలు' అనే అధ్యయనం విశదీకరించింది. ఇంకొందరు తమ తొలి రాత్రిని, ఇతరులతో పెట్టుకున్న సంబంధాలను కూడా అప్‌లోడ్ చేస్తూ వికృతానందాన్ని పొందుతున్నారు. మియా ఖలీఫా అనే ఒక మాజీపోర్న్ స్టార్ అందమైన అమ్మాయిలను అశ్లీల పరిశ్రమ ఏ విధంగా నియంత్రిస్తుందో వివరించారు. 'యువతులను వేటాడి పట్టుకొని, వాళ్లను ఆసరాగా చేసుకొని, ఊహించని విధంగా డబ్బులిచ్చి చట్టబద్ధంగా లోబరచుకుంటారు. బయటపడటం కష్టతర వ్యవహారం' అని ఆయన వెల్లడించారు.

## అంతా మాయాబజార్

పోర్న్ చిత్రాలు, సినిమాలలో కనిపించే దృశ్యాలు చాలా వరకు ఫేక్ అనే విషయం ఎక్కువ మందికి తెలియనే తెలియదు. అదంతా భ్రమ, మాయాజార్. మన మగ మహారాజులు వాటిని బాగా ఊహించుకొని బాధితులుగా మారుతున్నారు. మార్కెట్‌లో దొరికే అడ్డమైన, ఖరీదైన జెల్లులు, మందులు వాడుతుంటారు. పోర్న్ చిత్రాల పరిశ్రమ ఆపార వ్యాపారం. కేవలం యునైటెడ్ స్టేట్స్ లోనే ఏటా 16.9 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతోందని అంచనా. కంప్యూటర్ ఉపయోగించే 28శాతం మంది లైంగిక వెబ్ పేజీలను సందర్శిస్తారు. లైంగిక,

అసభ్యకర, అశ్లీల చిత్రాలు ప్రసారం చేయడం, చూడడం భారతీయ చట్టాల ప్రకారం శిక్షార్హం. 1860-IFT, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT చట్టం- 2000), లైంగిక నేరాలు నుండి పిల్లల రక్షణ చట్టం (POCSO)-2012, మహిళల అసభ్య ప్రాతినిధ్యం (నిషేధం) చట్టం-1986 (IRWA) సెక్షన్ 292 ప్రకారం వీటిని నిషేధించారు. సెక్షన్ 293, IT చట్టం-67B ప్రకారం 20 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారికి అశ్లీల సమాచారం పంపిణీ, అమ్మకం శిక్షార్హమే, చట్టవిరుద్ధం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000 సెక్షన్ 67B ప్రకారం దేశవ్యాప్తంగా చైల్డ్ పోర్నోగ్రఫీ నిషేధించబడింది. సెక్షన్ 292, 293 ప్రకారం అశ్లీల చిత్రాల తయారీ, ప్రచురణ, పంపిణీ చట్టవిరుద్ధం.

### జీవితం.. సర్వనాశనం



పోర్న్ చిత్రాలు చూసేవారు తమవారికి క్రమంగా దూరమవుతూ ఒంటరితనానికి అలవాటు పడ తారు. ఎక్కువ సమయం పోర్న్ చూడటానికే వెచ్చిస్తారు. జీవిత భాగస్వామిపై అభిమానం, ఆప్యాయతకి బదులుగా అనుమానం పెంచు కుంటారు. పదే పదే గొడవలు, గాయపరిచే సంఘటనలు జరిగే అవకాశాలు ఎక్కువ. దీనిని మాన్పించకపోతే మరింత క్రూరంగా, జుగుప్సాకరంగా నిర్ఘాంతపోయేంత అమానవీయంగా మారుతూ ఎందుకూ కొరగాకుండాపోతారు. వ్యక్తిగత జీవితం, కుటుంబ జీవితం, వృత్తి జీవితం దెబ్బతింటుంది. అందుకే ప్రభుత్వాలు పోర్న్ చిత్రాల సైట్లను సంపూర్ణంగా నిషేదించాలి. మత్తు పదార్థాల తయారీ, వినియోగం, రవాణాపై పూర్తిస్థాయి నియంత్రణ కఠినంగా అమలు చేయాలి. శాస్త్రీయ దృక్పథంతో కూడిన అవగాహన కలిగించడం అత్యవసరం. స్కూల్, కాలేజ్, విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలి. తల్లిదండ్రులు.. పిల్లల ఎదుగుదల సమయాలలో ఆదర్శ ప్రాయంగా తాము మెలిగేలా చూసుకోవాలి.



**డా॥ బి.కేశవులు**
ఎం.డీ. సైక్రియాట్రీ చైర్మన్,
తెలంగాణ మేధావుల సంఘం.
జాతీయ యాంటీడ్రగ్స్ సంస్థ

# మాదక ద్రవ్యాలు మనిషి జీవితం - రాజకీయాలు



గన్స్ అండ్ గులాబ్స్ అనే సిరీస్ Netflix లో ఉంది. దుల్కర్ సల్మాన్, రాజ్‌కుమార్ రావ్ నటించిన ఈ సిరీస్ కథ 90లలో ఉత్తరాది రాష్ట్రాల్లో పండిస్తున్న గసగసాల సాగు చుట్టూ నడుస్తుంది. లైసెన్స్‌తో పరిమిత సాగు చేసే రైతులు.. పండిన పంటను ప్రభుత్వానికే అమ్ముతుంటారు. ప్రభుత్వం ఆ పంటను కొంత ఇక్కడ తయారయ్యే ఔషధాల కోసం వినియోగిస్తూ కొంత ఎగుమతి చేస్తూ ఉంటుంది. అయితే ఇప్పుడు చదవబోయేది ఆ సిరీస్ గురించి కాదు. ఇటీవల మణిపూర్‌లో కుకీలను మాదక ద్రవ్యాల తయారీదారులుగా ప్రచారం జరుగుతున్న సందర్భంలో గసగసాలు, గంజాయి మొక్కల సాగు ఇంకా వాటి చుట్టూ అల్లుకున్న మాదక ద్రవ్యాల, మత్తు మందుల వ్యసనాల గురించి విస్తృతంగా తెలియచేసే ఒక పుస్తకం గురించి మాట్లాడుకోవాలి.

Most of what you know about addiction is wrong (వ్యసనాల గురించి మనకు తెలిసిన దాంట్లో ఎక్కువ భాగం తప్పు). ఇదే ఆ పుస్తకం. అనిరుధ్ కాలా అనే పంజాబీ సైకియాట్రిస్ట్ రాసిన ఈ పుస్తకం వ్యసనాలకు సంబంధించి మనకున్న భావనలు అనేకం అపోహాలని చెబుతుంది. భారతదేశంలో 'మెంటల్ హెల్త్ చట్టం' తీసుకొని రావడానికి కృషి చేసిన వ్యక్తి ఈ పుస్తక రచయిత అనిరుధ్ కాలా. హెూమో సెక్సువాలిటీ గురించి అధ్యక్షుడు చెడుగా మాట్లాడినందుకు తాను నలభై సంవత్సరాలుగా క్రియాశీలకంగా పని చేసిన 'ఇండియన్ సైక్రియాట్రిక్ సొసైటి' నుంచి వైదొలిగాడు. ఆయన గతంలో 'ద అన్ సేఫ్ అసైలమ్: స్టోరీస్ ఆఫ్ పార్టిషన్ అండ్ మేడ్ నెస్' అనే కథల పుస్తకాన్ని రాశారు. అందులో ఒక కథను మాతృకలో ప్రచురించాము. 'టు అండ్ ఆఫ్ రివర్స్' అనే ఆయన నవల 1980లలో పంజాబ్‌లో వచ్చిన సాయుధ పోరాటం గురించి చెబుతుంది. 'Most of what you know about addiction is wrong' పుస్తకం పంజాబ్ కేంద్రంగా జరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం, వ్యాపారం, దాని చుట్టూ అల్లుకొని ఉన్న దేశ, విదేశ రాజకీయాల గురించి చెబుతుంది.

ఈ పుస్తకంలో ఉన్న 10 భాగాలు వ్యసనాల గురించి లోతుగా విశ్లేషణ చేస్తాయి. ఒకే కుటుంబంలో తాగుడు, పొగాకు అలవాటు ఉన్న వాళ్లను వ్యసనపరులుగా చూడకుండా, అదే కుటుంబంలో హెరాయిన్ అలవాటు ఉన్న వాడిని మాత్రమే ప్రమాదకరంగా చూసే దృక్పథానికి మూల కారణాలను ఈ పుస్తకం చర్చిస్తుంది.

**మనుషులు మత్తుమందులు**

వ్యసనపరులుగా తయారు కావడానికి మూలకారణం జెనెటిక్ (వంశపారంపర్యం) అని రుజువయ్యింది. అయితే ఒక వంశంలో అందరూ అలా తయారవుతారా అన్న ప్రశ్నకు

జవాబు కాదనే వస్తుంది. పరిస్థితుల ప్రాబల్యం, మత్తుమందులు సులభంగా లభ్యం కావడం కూడా కారణాలవుతాయి. చిన్నతనంలో శారీరక, లైంగిక అవమానాలకు గురైన వాళ్ల ఎక్కువ శాతం మత్తుమందుల వ్యసన పరులవుతారు. భారీ కాయం వల్ల ఎలాగైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందో శారీరక, లైంగిక అవమానాలు గురైన వారికి మత్తుమందుల వ్యసనం అయ్యే అవకాశం ఎక్కువ ఉంటుందని అనే సర్వేలు, ప్రయోగాలు నిరూపించాయి. మత్తుమందుల బారిన పడకుండా ఉండటానికి ఒక్క వ్యక్తో, ఒక కుటుంబమో కాకుండా సమాజం అంతా ప్రయత్నం చేయాలి. ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించడానికి ప్రభుత్వం కూడా విధివిధానాలను ఏర్పాటు చేయాలి.

వ్యసనం కేవలం మత్తుమందులకు మాత్రమే పరిమితమై ఉండదు. దేన్నీ లెక్క చేయకుండా, తనకి ఆనందాన్ని ఇచ్చే పనిని చేస్తూ పోయే ధోరణి వ్యసనమే అవుతుంది. డ్రగ్స్, వ్యసనం అనే రెండు పదాలను తీసుకొంటే వ్యసనం అనే పదమే కీలకం అని అంటారు రచయిత. డ్రగ్స్ వాడకుండానే ప్రవర్తనాపరమైన వ్యసనాలు కొన్ని ఉంటాయి. నెగటివ్ సెన్స్‌లో చెప్పే సెక్స్ ఎడిక్ట్, వర్క్ ఎడిక్ట్‌లే కాకుండా మనిషిని నిష్క్రియాపరంగానూ, విధ్వంసకరంగా, శక్తిరహితంగా చేసేవి ఏవైనా వ్యసనాలే. American Society of Addiction Medicine నిర్వచనం ప్రకారం వ్యసనం వదలని మెదడు జబ్బు. ఆ జబ్బు గుర్తింపు, ప్రేరణ, జ్ఞాపకాలు, వాటికి సంబంధించిన వలయాల ప్రమేయంతో కొనసాగుతుంది. వ్యసనాల్లో డ్రగ్స్ ఒక భాగం కావచ్చు. కానీ డ్రగ్స్ రహిత వ్యసనాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు గుర్తింపు కోసం చేసే మితిమీరిన ప్రవర్తన కూడా వ్యసనమే. స్వాములకు, బాబాలకు ఎడిక్ట్ అయ్యేవాళ్లు కూడా వ్యసనపరుల కిందకే వస్తారు. వీడియో ఆటలు, జూదం, విపరీతమైన షాపింగులు, అశ్లీల సినిమాల వీక్షణం, మితిమీరిన తిండి, అధిక సెక్స్‌లు కూడా ఈ కోవలోకే వస్తాయి. మనిషికి ఆహ్లాదాన్ని ఇచ్చే ఈ విషయాలకి మామూలు మెదడు అయితే ఒక పరిమితి తరువాత 'ఇక చాలు' అని చెబుతుంది. వ్యసనపు మెదడు వలయాలు ఉన్న వారికి ఆ సంకేతం అందదు. తమ శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక శ్రేయస్సులకు ఎంత నష్టం వాటిల్లినా కూడా ఆయా వ్యక్తులు పట్టించుకోరు. అయితే వ్యసనపరుల మెదడు వలయాలు, వ్యసనపరులు కాని వ్యక్తుల మెదడు వలయాలు వేరుగా ఉంటాయి. ఆ వ్యసనం మత్తుమందుల వల్ల అయినా, లేక ప్రవర్తనాపరమైన వ్యసనం అయినా ఈ తేడా ఆ మెదడు నిర్మాణంలోనే ఉంటుంది.

మనుషులు, డ్రగ్స్ అనేక సంవత్సరాలుగా కలిసి ప్రయాణం చేశాయనీ, వారిద్దరి మధ్య స్నేహం పరిణామాత్మకమైనదనీ అంటారు రచయిత. 7,500 సంవత్సరాల క్రితం స్పెయిన్ దేశపు అస్థిపంజరం పళ్లల్లో గసగసాల తాలూకు ఆనవాళ్లు దొరికాయట. అలాగే స్పెయిన్ గుహల్లో శవాలను పూడ్చిపెట్టిన చోట ఉన్న బంగారు నగలతో బాటు, సంచుల్లో గంజాయి దొరికిందట. క్రీస్తుశకం 6వ శతాబ్దంలో నల్లమందు తాలూకు విత్తనాలు భారతదేశానికి వచ్చాయంటారు. అవి తెచ్చినందుకు అలగ్జాండర్ ద గ్రేట్ కు ఆ క్రెడిట్ ఇస్తారు. 14వ శతాబ్దం తరువాతనే నల్లమందును

బహిరంగంగా ఔషధాలలో వినియోగించినట్లు గ్రంధాల ద్వారా తెలుస్తోంది. 17వ శతాబ్దంలో అమెరికాలో పసిపిల్లలను చిన్న చిన్న నొప్పుల నుంచి విముక్తి చేసి, నిద్ర బుచ్చటానికి వాడిన టానిక్కులలో నల్లమందు ఉండింది.

అమెరికాలో ఆ టానిక్కుల వ్యాపార ప్రకటనలు విరివిగా వచ్చేవి.

ఇక్కడ మాదక ద్రవ్యాల పేరుతో చలామణి అవుతున్నవాటి గురించి కొద్దిగా తెలుసుకోవాలి. నల్లమందును గసగసాల పంట నుంచి తయారు చేస్తారు. దాని నుంచే మార్ఫిన్, హెరాయిన్ (మార్ఫిన్‌కు కొన్ని మందులు కలిపి తయారు చేస్తారు), కొకైన్ లాంటి మత్తు పదార్థాలు తయారవుతాయి. గంజాయి మొక్క ఇంకో రకం మత్తును ఇస్తుంది. ఈ మొక్కలో అనేక ఔషధ విలువలు ఉంటాయి. అది మనిషి మూడ్‌ను ఆహ్లాదకరంగా మారుస్తుంది. వినోదానికి, మందులకు, పరిశ్రమలకు గంజాయిని వినియోగిస్తారు. ఇక భారతదేశానికి వస్తే ప్రపంచంలోనే నల్లమందును ఉత్పత్తి చేయడానికి అనుమతి ఉన్న అతి తక్కువ దేశాల్లో భారతదేశం ఒకటి. ఇక్కడ 'బంక నల్లమందు' కూడా అధికారకంగానే తయారవుతుంది. అయితే ఇక్కడ కేవలం ఒకశాతం మాత్రమే ప్రజలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ఉన్నారు. అలవాటు పడిన వారిలో ఎక్కువ ఈశాన్య రాష్ట్రాలు, పంజాబ్ నుంచి ఉన్నారు. మాదక ద్రవ్యాలు అంటే నల్లమందు, గంజాయి, వాటి ఉప ఉత్పత్తులు మాత్రమేనని ప్రచారంలో ఉన్నమాట ఇక్కడ గుర్తుంచుకోవాలి.

1893 ప్రాంతంలో భారత దేశంలో గంజాయి తాగుతున్న వారు, దాని చెడు ప్రభావాలపై సర్వే చేసేందుకు బ్రిటిష్ 'రాయల్ ఓపియం కమిషన్'ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ 1200మంది డాక్టర్లనూ, కూలీలను, యోగులను, ఫకీరులను, మానసిక ఆరోగ్య సంస్థల అధిపతులను, భంగ్ పండించే రైతులను, పన్నువసూలు చేసేవారిని, స్మగ్లర్లను, సైనికాధికారులను, పూజార్లను సర్వే చేసి 3,281 పేజీల రిపోర్ట్ ఇచ్చింది. ఆ రిపోర్ట్ ప్రకారం గంజాయి తగు మోతాదులో వినియోగించడం వల్ల ఎలాంటి నష్టమూ లేదు.

మార్ఫిన్ నుంచి హెరాయిన్‌ను తయారు చేసే 'వంట గదులు' భారతదేశంలో పశ్చిమం నుంచి తూర్పు వరకూ విస్తరించి ఉన్నాయి. థాయిలాండ్, మయన్మార్, లావోస్ సరిహద్దులను కలిపే త్రికోణాకర స్థలం కొండలతో నిండి ఉంది. అక్కడ నల్లమందు నుంచి వెలికి తీసిన మార్ఫిన్‌ను అతి సులువు రసాయన పద్ధతులతో హెరాయిన్‌గా మారుస్తారు. నల్లమందు తయారు చేసే దేశాల్లో ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్ ప్రథమంగా ఉంది. అక్కడి అస్థిరమైన రాజకీయ పరిస్థితులు ఆ ప్రజలను నల్లమందుని ఇచ్చే గసగసాల పంటను విస్తృతంగా పండించే వైపు తోసింది. ఆఫ్ఘనిస్థాన్ నుంచి భారతదేశానికి పాకిస్తాన్ ద్వారా హెరాయిన్, నల్లమందు సరఫరా అయ్యే సరిహద్దులు ఉండటం వల్ల పంజాబ్‌లో ఎక్కువ మాదక ద్రవ్యాల వ్యసనపరులు ఉంటారని అనుకుంటారు. కానీ ఇటీవల పంజాబ్‌లో పట్టుబడిన 188 కిలోల హెరాయిన్ ఆ రాష్ట్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకిస్తాన్ నుంచి రాలేదు. 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్ నుంచి వచ్చినట్లు తేలింది.

భారత సాంప్రదాయంలో నల్లమందును, ఆల్కహాల్ ను ఆమోదించే గుణం అనాదిగా ఉందని అంటారు రచయిత. 1980లలో పంజాబ్‌లో తమ దగ్గర పని చేసే రైతు కూలీలకు ఏడాదికి రెండుసార్లు నల్లమందును సరఫరా చేయటం భూస్వాములు ఒక హోదాగా పరిగణించారు. ఆ నల్లమందుతో కూలీలు అవిరామంగా పని చేస్తారనే స్వార్థం కూడా ఉంది. గసగసాల పంటను తీశాక ఆ చెట్లను పశువులకు వేస్తే అవి హాయిగా ఉండేవట. 90ల దాకా నల్లమందు వ్యసనం ఉన్న

కేసులు చాలా తక్కువగా సైకియార్టిస్టుల వద్దకు వచ్చేవి. ఎందుకంటే ప్రజలు, కుటుంబాలు నల్లమందును తీసుకోవడాన్ని వ్యసనంగా భావించేవారు కాదు.

కానీ తరువాత కాలంలో పరిస్థితులు వేగంగా మారిపోయాయి. మరీ చిన్నపిల్లలు డ్రగ్స్ వ్యసనపరులుగా మారారు. డ్రగ్స్ కూడా మారిపోయాయి. ప్రోక్సీ పేరుతో సింథటిక్ నల్లమందు గొట్టాల రూపంలో వాడుకలోకి వచ్చింది. డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ తో మాత్రమే అమ్మాల్సిన ఈ మందు వీధి చివర ఉన్న మందుల షాపుల్లో పప్పుబెల్లాల్లాగా అందరికీ అందుబాటులోకి వచ్చింది. 1985కు ముందు గసగసాల పొడి పేదవాడి నల్లమందు అయితే, 90లలో సింథటిక్ నల్లమందు రంగప్రవేశం చేసి, ఒక తరంలోని కొంత శాతం యువత భవిష్యత్‌ను నాశనం చేసింది. ఇక 2007లో రంగప్రవేశం చేసిన హెరాయిన్‌ను (ప్లాస్టిక్ మాదక ద్రవ్యం) ఇప్పుడు పంజాబ్ లోని 80–90 శాతం వ్యసనపరులు వాడుతున్నారు. సహజ మత్తుమందుల వినియోగం నుంచి, అసహజమైన ప్లాస్టిక్ మాదక ద్రవ్యాల వాడకానికి ప్రజలు మరలటానికి కారణం అమెరికా ప్రకటించిన 'మాదక ద్రవ్యాల మీద యుద్ధ'మేనని అంటారు రచయిత. ఈ సోకాల్డ్ యుద్ధం కొన్ని అంతర్జాతీయ ఒప్పందాల ఊతంతో అన్ని రకాల సహజ మాదక ద్రవ్యాల మీద ప్రపంచవ్యాప్తంగా నిషేధం విధించింది. అమెరికాను అనుకరించి చేస్తున్న ఈ యుద్ధం వల్ల భారత్ చాలా మూల్యాన్ని చెల్లిస్తోంది. ఈ నిషేధం ఎంత ప్రమాదకరంగా మారిందంటే.. ఇంతకు ముందు తక్కువ మోతాదు మత్తుతో, ఎక్కువ పరిణామంలో ఉండే మత్తు పదార్థాలు ఇప్పుడు అక్రమ రవాణాకు అనుకూలంగా తక్కువ సైజులో, ఎక్కువ సాంద్రతతో తయారయ్యాయి. మత్తుని పెంచడానికి అనేక ప్రమాదకర కలుషితాలు అందులో కలగలుపుతున్నారు. ఇవి అక్రమంగా సరఫరా అవుతున్నాయి కనుక.. ఎక్కడా వీటిని పరీక్షించి, నియంత్రించడం జరగదు.

'మాదక ద్రవ్యాలపై యుద్ధం' అంటే మన యువతపై యుద్ధమేనని రచయిత అభిప్రాయ పడ్డారు. మానవ మెదడుకు ఉల్లాసాన్ని ఇచ్చే మందుల వినియోగం ఇప్పుడు నిషేధానికి గురయ్యింది. గంజాయి, గసగసాల ఉత్పత్తుల వల్ల కలిగే నష్టం వాటికి ఎడిక్ట్ అవటమే. ఆ ఎడిక్షన్ నుంచి బయట పడటం కూడా సులభమే. వాటి వల్ల ఎలాంటి ఆరోగ్య నష్టాలు ఉండవు. భారత్ అంతర్జాతీయంగా సంతకం చేసిన ఒప్పందాల ఫలితంగా వచ్చిన Narcotics Drugs and Psychotropic Substances (NDPS) లాంటి చట్టాలు యువతను వేధింపుల గురి చేస్తున్నాయి. పంజాబ్ జైళ్లలో ఉన్నవారిలో 40శాతం డ్రగ్స్ 'కలిగి ఉండటం' అనే నేరాన్ని చేసిన వాళ్లే. అది ఎంత తక్కువ శాతమైనా శిక్ష ఒకటే. నిజమైన ఆరోగ్య క్షీణక కారణాలైన మద్యం, సిగెరట్టులు ఎలాంటి నిషేధం లేకుండా విచ్చల విడిగా వినియోగంలో ఉండగా.. నిషేధం కారణంగా సహజ మత్తునిచ్చే గసగసాలు, గంజాయిలు ప్లాస్టిక్ మందులతో కలుషితమై, ప్రమాదకరంగా మారాయి. ఇంకో పక్క ఈ 'యుద్ధాన్ని' మొదలు పెట్టిన అమెరికా తన రాష్ట్రాల్లో క్రమంగా నిషేధాన్ని సడలిస్తూ వస్తోంది.

అంతర్జాతీయ నిబంధనలను తలవొగ్గుతూ గసగసాలు, గంజాయి, కోకా మొక్కల నుంచి వచ్చే సహజ, అసహజ మత్తు పదార్థాల నిషేధంపై విధించిన భారతదేశం భంగ్ మీద నిషేధాన్ని సడలించడం ఆసక్తికరం. భంగ్ భారతదేశ సాంప్రదాయ

మత్తుమందనీ, మతపరమైన వేడుకల్లో వాడతారనీ.. ఇండియా చెప్పుకుంటోంది. గంజాయి మొక్క నుంచే తయారయ్యే భంగ్ హఠాత్తుగా పవిత్రతను ఆపాదించుకోవడానికి కారణం వారణాసి లాంటి దైవస్థలాల్లో బ్రాహ్మలు, యోగులు కూడా దాన్ని వినియోగించడమే. భంగ్ శివుడి ఆశీర్వాదంతో వచ్చిందనే నమ్మకం కూడా నిషేధానికి గురి కాకుండా ఉపయోగపడింది.

ఈ పుస్తకంలో రచయిత మాదక ద్రవ్యాల వ్యసనానికి ఉన్న ఆర్థిక సామాజిక కారణాలను కూడా పంజాబ్‌ను కేంద్రంగా తీసుకొని విశ్లేషించారు. పంజాబ్‌లో వచ్చిన ఆకుపచ్చ విప్లవం నిజానికి అక్కడ ప్రజలను ఆత్మహత్యల వైపు తోసిందని చెబుతారు రచయిత. అక్కడి మాదక ద్రవ్యాల వ్యసనం కూడా పాక్షికంగా ఆత్మహత్యేనని ఆయన అంటారు. 1950ల నాటి కరువు నుంచి కాపాడుకోవటానికి భారత్ అమెరికా గోధుమలపై ఆధారపడింది. ఆ గోధుమలను కొనడానికి భారత్ డాలర్ల రూపంలో అత్యధికంగా డబ్బు చెల్లించాల్సి వచ్చింది. అమెరికా దేశపు అదనపు ధాన్యాల ఎగుమతి వల్ల వచ్చిన ఆదాయాన్ని.. ఆ ఆదాయాన్ని ఇచ్చిన దేశాల అభివృద్ధికే ఉపయోగించాలనే నియమపు పర్యవసానమే పంజాబ్‌లో గ్రీన్ రివల్యూషన్. మానవ వనరులను, సాంకేతిక వనరులను విస్తృతంగా ఉపయోగించి భారతదేశానికి అదనపు ధాన్య ఉత్పత్తిని గ్రీన్ రివల్యూషన్ ద్వారా పంజాబ్ ఇవ్వగలిగింది. అయితే ఇక్కడి వ్యవసాయం ఎక్కువగా ట్రాక్టర్లు, మర యంత్రాలు, పురుగు మందులు, రసాయన ఎరువులపై ఆధారపడటంంతో.. దానికి కావాల్సిన పెట్టుబడి కోసం రైతులు బ్యాంకుల వద్ద కాకుండా, రా పని తక్కువగా ఉండే స్థానిక వడ్డీ వ్యాపారులపై ఆధార పడ్డారు. కాలం గడిచే కొద్దీ.. ఇంతకుముందు పెద్ద పెద్ద భూ ఖండాలుగా ఉన్న భూమి కుటుంబాలలో విభజనకు లోనవడం, పంజాబ్‌లో ఎన్ని నదులు ఉన్నా పంట కాలవల వ్యవస్థ ప్రాథమికంగానే ఉండటం, విరివిగా నీరు తాగే వరిపంట కోసం నీళ్లు సరిపోక రైతులు బోర్లు వేయడం, బోర్ల నుంచి నీరు పైకి రావడానికి కరెంట్ అవసరం ఎక్కువ కావడం, ఇంకా అనేకానేక కారణాల వల్ల వ్యవసాయం చాలా ఖరీదుగా మారింది. వ్యవసాయానికి అనుబంధంగా పరిశ్రమలు రావాల్సిన అవసరాన్ని భారతదేశ రాజకీయ వ్యవస్థలు గుర్తించక పోవడం వల్ల.. వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడులు ఖరీదు పెరిగి, పెద్ద రైతులు సన్నకారు రైతులుగా మారి క్షీణించి పోయారు. తరువాత తరాల్లో పిల్లలు అటు వ్యవసాయం చేయలేక, ఇటు ఉద్యోగాలు లేక బేకారుగా తిరగడం కూడా పంజాబ్‌లో మాదక ద్రవ్యాల వ్యసనపరులు ఎక్కువగా తయారవడానికి కారణమైందని అంటారు రచయిత. మత్తుమందులు, వ్యసనాలు, ప్రభుత్వవిధానాలు, అంతర్జాతీయ కుట్రలు, పెట్టుబడిదారి అనుకూల విధానాలు.. వీటన్నిటి గురించి కళ్లు తెరిపించే పుస్తకం Most of what you know about addiction is wrong. అవకాశం ఉన్నవాళ్లు తప్పక చదవాల్సిన పుస్తకం.



**రమాసుందరి**
మాతృక పత్రిక, ఒంగోలు

# పోర్నోగ్రఫీ ఒక వృత్తా?

దిగజారుడు సంస్కృతికి ప్రతీకగా మారిన ఓ సృజనాత్మక కాపీ దర్శకుడొకాయన 'నేను పోర్న్‌స్టార్ అవుతా అది ఒక వృత్తిగా ఆమోదించండి. అది నా ఎంపిక' అని ఓ అమ్మాయి చేత తల్లిదండ్రులకు చెప్పిస్తాడు. అదో సినిమా... యూట్యూబ్‌లో విడుదల కూడా అయ్యిందట. ఇదో పెద్ద విప్లవాత్మక ఆలోచన అనీ సాంప్రదాయవాదులైన ఉద్యమ కారులు, స్త్రీ వాదులూ కూడా దీన్ని జీర్ణం చేసుకోలేనంత వెనుకబాటుతనంలో ఉన్నారని అతను మురిసి పోతున్నాడు. ఈ అంశాన్ని హేతుబద్ధంగా ముందే స్థిర పరుచుకున్న అభిప్రాయాలను (ప్రిజుడీస్) వదిలివేసి నైతిక సమస్యగా కాకుండా నిష్పక్షపాతంగా వస్తుగత దృష్టితో పరిశీలించే ప్రయత్నం చేద్దాం.

ఒకటి పోర్నోగ్రఫీ అనేది ఏమిటి? దానిలో స్టార్ అవడం, అనేది ఒక వృత్తిగా పరిగణించవచ్చా అనేది రెండు ప్రధాన ప్రశ్నలు. పోర్నోగ్రఫీ అంటే పచ్చి బూతు సినిమా... అంటే స్త్రీ-పురుషుల శరీర సంబంధాల్ని అతిచిన్న వివరంతో సహా కెమెరాతో చిత్రీకరించి దాన్ని నెట్‌లో ఉంచడం. దీనిలో మళ్లీ జంతువులతో సెక్స్, రక్త సంబంధీకుల సెక్స్, అత్యాచారాలు, రక్తసిక్తమైన లైంగిక దాడులు, సైన్యం చేసే అఘాయిత్యాలు, సామూహిక సెక్స్, శవాలతో సెక్స్, పిల్లలతో సెక్స్, స్వలింగ రేప్‌లు వంటి రకరకాల వికృతాలు ఉంటాయని ఇటువంటివి 4 కోట్ల వెబ్‌సైట్లు ఉన్నాయని ఇటీవలే



విడుదలైన ఒక పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు. దీన్ని ఏమనాలి? ఇది సినిమానా? వినోదమా? పైశాచికత్వమా? విశృంఖలత్వమా? దీన్ని ఒక కళగానో కనీసం ఒక ప్రచారంగానో భావిం చడం సాధ్యమా? ఇది స్త్రీ-పురుషుల కలయికల్ని యాంత్రికంగా, క్రూరరంగా చిత్రించడమే. వాటికి స్త్రీల శరీరాల్ని (కొన్నిసార్లు పురుషుల శరీరాల్ని) కూడా వారి అనుమతితో సంబంధం లేకుండా ఎట్లాగయినా అనుభవించ వచ్చని చూపడమే కాదు. ఆమె దానికి బాధపడక పోగా ఆనందిస్తుందనీ, బాధాకరమైన హింసాత్మకమైన సెక్స్ కూడా స్త్రీలకు అవసరం అని ఈ లైంగిక హింస పురుషుల సహజ వాంఛగా వారి అదుపులో లేనిదిగా ఈ బూతు చిత్రాలు చూపే సారాంశం. ప్రతి సమాజంలో బానిస యజమానుల కాలం నుంచి, గ్రీకు నగర రాజ్యాలలో నుంచి ఈనాటి దాకా ఇటువంటి హింసాత్మక సెక్స్‌ను కోరే వారు లేరని కాదు. కానీ అదెప్పుడూ సామాన్యుడి ఆమోదం ఏ దేశంలోనూ పొందలేదు. దానికి కారణం

స్త్రీ-పురుషుల శారీరక సంబంధాలు అనేక సున్నిత అంశాలతో ముడిపడి పరిణామం చెందుతూ వచ్చాయి. జంతువులలో సహజ ఉత్ప్రేరితంగా ఉండే లైంగిక చర్యలు సంతానోత్పత్తి కోసమే పరిమితం అవుతాయి. మానవులు ఆ దశ దాటారు. అంతర్గత నిషేధాలతో స్వచ్ఛందంగానే రక్త సంబంధీకుల మధ్య, తరాల మధ్య శారీరక కలయికల్ని నిషేధించుకుంటూ వచ్చారు. గుంపు వివాహాల స్థానంలో జంటగా కలిసి ఉండే స్థితికి రావడానికి ప్రధాన కారణం.. స్త్రీ కావచ్చునంటాడు మోర్గాన్. గుంపు సంబంధాల్లో ఉండే లైంగిక హింసను స్త్రీ ఇష్టపడక పోవడం దీనికి కారణం కావచ్చు నంటాము. ఆ తర్వాత కాలంలో వచ్చిన దాంపత్య వివాహ వ్యవస్థ స్త్రీల ఇచ్ఛను, ఎంపిక స్వేచ్ఛను కాలరాసి, ఆమెను కులసతిగా, వారసుల్ని కనిపెంచే భర్తకు మాత్రమే శరీరాన్ని ఇచ్చే పతివ్రతగా మార్చారు. స్త్రీ శరీరంపైనా లైంగికత్వం (సెక్సువాలిటీ) పైనా అణువణువునా ఆంక్షలు విధించి.. బందీ చేయడానికి కారణం సంతానానికి తండ్రేనని నమ్మకం కావడమే. అయితే స్త్రీని తన బందీగా చేసుకున్న పురుషుడు తాను మాత్రం ఏ ఒక్క కట్టుబాటు పెట్టుకోలేదు. కాబట్టే దాంపత్య వివాహ వ్యవస్థ యొక్క మరొక కోణమే వ్యభిచారం. అంతకు ముందు వ్యభిచారం లేదు.

స్త్రీ-పురుషుల శారీరక సంబంధం కేవలం సంతానం కోసమే కాదు. జంతువుల కంటే భిన్నంగా ఈ కలయిక మానసిక అనుభూతుల కలయికతో ఉండటం వల్ల ఆనందాన్ని, సుఖాన్ని ఇవ్వడం వల్ల దీనికో ప్రత్యేకత ఏర్పడింది. పరస్పర శారీరక ఆకర్షణ, మోహం, జతను ఎంచుకోవడంలో ప్రధానం. దీనిని పక్కన బెట్టి ఆస్తికి వారసుల్ని ఇవ్వడానికి సామాజిక హోదా, ధనం, కులం, మతం, ఆచారాలు సంప్రదాయాలు, కుటుంబాలు ప్రధానం కావడంతో దాంపత్యంలో తీరని కోర్కెలు తీర్చుకోవడానికి పురుషుడికి సమాజం మినహాయింపులు ఇచ్చింది. అతని తిరుగుళ్లను ఆమోదించింది. ప్రోత్సహించింది. కానీ ఈ 'మగాడి' తనానికి ఎరయిన స్త్రీలు మాత్రం వ్యభిచారులుగా, పతితలుగా మారారు.

ఫ్యూడల్ ప్రభువులంతా వ్యభిచారులే. శ్రామిక స్త్రీలు, దాసీలు, కింది కాలాల వారు వారి కోర్కెలు తీర్చాల్సిందే. కొన్ని కులాలనే మన దేశంలో వ్యభిచారం కోసం ఏర్పాటు చేశారు. అదీ చాలక జోగినీలు, మాతంగిలు, దేవదాసీలు, పేరేదయినా కంటికి ఎదురుగా ఉండే కింది కులాల అమ్మాయిల్ని అధికారికంగా, దైవానుగ్రహంతో వ్యభిచారంలోకి దించారు. అయితే వ్యభిచారం, వ్యభిచారత్వాన్ని ఏ సమాజం.. పైకి ఆమోదించ లేదు. అది ఉందని మాత్రం అంగీకరించింది. మనకయితే ఏకంగా దేవ వేశ్యలే ఉన్నారు. వారిని అధీనంలో ఉంచుకున్న యింద్రుడు పచ్చి వ్యభిచారి. మతాలు నైతిక కారణాలుగా దీన్ని ఖండించినా ఈ పాపానికి స్త్రీలనే నిందించాయి. ఉన్నతమైన పురుషుల్ని ఆకర్షించి, కామోద్రేకం తీర్చి, అధఃపాతాళానికి లాగడానికి స్త్రీలే కారణంగా దూషించాయి. అయితే స్త్రీ పురుషుల కలయిక 'సిగ్గు' ఎరుగని కాలంలో అది భూమికి శక్తి (ఫెర్టిలిటీ)ని పెంచే

పవిత్ర కార్యంగా ఎంచబడింది. (తాపీ ధర్మారావు గారి 'దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు' పుస్తకం) తరువాత కాలంలో తాంత్రిక సాధన, యోని పూజల్ని సమాజం అసహ్యించుకుంది. మొత్తం మీద జరిగిన పరిణామంలో స్త్రీ-పురుషుల సంబంధాలు సంతానోత్పత్తి కోసమే కాక స్త్రీ-పురుషుల సాన్నిహిత్యానికి సంతృప్తికి అవసరమైనవిగా, గోప్యంగా ఉంచాల్సినవిగా 'ఆధునికత' భావించింది. ఒక పక్క వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ)ని ఆమోదించిన పారిశ్రామిక కాలం.. మరోవైపు బూతు కథలు, బొమ్మల పుస్తకాలతో బూతు వ్యాపారం ప్రారంభించింది. దేవాలయాలపై బూతు బొమ్మల ప్రయోజనం ఈ వ్యాపార ప్రయోజనం పూర్తిగా భిన్న ధృవాలు. ఈ కాలంలోనే వలసలు, వలస పురుషుల అవసరాలు తీర్చేందుకు స్త్రీ శరీరాల అమ్మకాలు, కొనుగోళ్లు అనే లాభదాయక వ్యాపారం భారీగా ప్రారంభమైంది.

తమంతట తాముగా ఒక వృత్తిగా భావించి (కుల వృత్తి అయితే కూడా తప్పదు కాబట్టి చేస్తారు) స్వచ్ఛందంగా శరీరాన్ని అమ్ముకునే స్త్రీలు ఎంత మంది? కుల వృత్తి కావడం చేత, ప్రేమలో మోసపోయి, అక్రమ రవాణాకు గురై, అత్యాచారాల వల్ల, భర్త చనిపోవడం, వదిలేయడం లేదా భర్తే ఆదాయం కోసం ఈ పనిలోకి దింపడం, కిడ్నాప్‌కు గురికావడం.. రకరకాల కారణాలతో ఈ యమా కూపంలోకి చేరే వారికి వారు పతితలు కాబట్టి ప్రత్యామ్నా యం లేకుండా చేసింది ఈ సమాజం.

ఇది ఎంపిక కాదు, పరిస్థితుల ఒత్తిడి.

'ఈ సమాజంలో పోలీసులు, సైన్యం, మతం, కులం, న్యాయవ్యవస్థ ఎంత అవసరమో వేశ్య వ్యవస్థ కూడా అంతే అవసరం' అంటాడు అగష్టో చెచెల్. శ్రమ దోపిడి వల్ల వచ్చే లాభాలను స్త్రీలు ఉచితంగా, ఇంటి చాకిరి చేసి బిడ్డల్ని కనిపెంచడం ద్వారా తేరగా వచ్చే పరోక్ష ఆదాయాలతో సరిపెట్టుకోలేదీ దోపిడీ వర్గం.

పురుషుల్లో అసహజమైన కామోద్రేకాల్ని చౌకబారుగా రెచ్చగొట్టి, ఒక కృత్రిమ అవసరాన్ని సృష్టిస్తుంది. కృతిమంగా తాను సృష్టించి అవసరాల్ని తీర్చే వంకతో స్త్రీల శరీరాల్ని నేరుగా అమ్మకానికి పెడుతుంది. పైగా ఈ రకంగా పురుషుల అవసరాల్ని తీర్చే స్త్రీ శరీరాలు అందుబాటులో లేకుంటే పురుషులు 'కుల స్త్రీ'ల పైకి ఎగబడతారు. కాబట్టి అటువంటి ప్రమాదం నివారించడానికి చట్టబద్ధమైన వ్యభిచార వృత్తి ఉండాలని వాదించి నిజమే అన్పించేలా చేస్తారు. మరి అటువంటప్పుడు.. పది మందితో తిరిగే భర్త, భార్యని పట్టించుకోని స్థితిలో ఆ భార్యల్ని ఈ పనికి వినియోగించవచ్చు కదా? వారి లైంగిక అవసరాలూ తీరతాయి. 'సమాజం క్షేమంగా ఉంటుంది. ఈ తర్కం రాగానే ఈ కపట వర్గానికి నైతిక విలువలు, కుటుంబ విలువలు గుర్తుకు వస్తాయి.

అట్లాగే పోర్నోగ్రఫీ వల్ల అవి 'చూసి' తృప్తిపడే పురుషులు.. లైంగిక హింసకు దూరంగా, ఉంటారని తద్వారా స్త్రీలు రక్షింపబడతారనే వాదన కూడా వుంది.

అదే తరహాలో లైంగిక చర్యల్ని

ప్రత్యక్షంగా సవివరంగా చూపించడం ఒక్కటే తప్పా? సినిమాల్లో బూతుని రెచ్చగొట్టే అర్ధనగ్న ప్రదర్శనలూ, లైంగిక చర్యలన్నింటినీ డాన్సుల రూపంలోనూ చూపితే ఉద్రేక పడరా? అసలు చర్య కంటే ఈ సగం సగం ప్రదర్శనలే ఎక్కువ రెచ్చగొడతాయనే భావించే వారూ ఉన్నారు. ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన పేరిట మూడొంతులు
నగ్నంగా చేసే ర్యాంప్ వాక్‌లు, అందాల పోటీలు, ప్రతి వస్తువు అమ్మకానికి స్త్రీ శరీరాన్ని ప్రతీకలుగా చూసే వ్యాపార ప్రకటనలు ఈ కోవలోకి రావా? అనే ప్రశ్న వస్తుంది. ఇవన్నీ స్త్రీ శరీరంపైనా స్త్రీ అవయవాలతోనూ జరిగే వ్యాపారాలే. మానవ శరీరాన్ని వినిమయ సరుకుగా తయారు చేస్తున్న ప్రక్రియలే, కాకపోతే.. మోతాదుల్లో తేడా అంతే. వీటికి పాలకవర్గాల ఆమోదం, చట్టాల అనుమతితో మర్యాద ముసుగులో జరుగుతున్న కాలుష్యమే ప్రసారం. వీటి ప్రయోజనం చౌకబారు సెక్స్ కోరికల్ని పెంచడం ద్వారా మరింతగా లాభాలు పొందడమే. మాదక ద్రవ్యాల అలవాటులో మోతాదులు పెరుగుతూ పోయినట్టుగానే ఈ అసహజ లైంగిక ప్రేరణల మోతాదు పెరుగుతూ పోయి చివరికి (ప్రస్తుతం) ఆధునిక టెక్నాలజీ పుణ్యమా అని అరచేతిలో పోర్నోగ్రఫీకి చేరింది. దోపిడీ సమాజపు కాపట్యంలో భాగమే. మధ్యయుగాల కుహనా నీతుల సారాంశమే... శరీరాన్ని తాకనంత వరకు లేదా అంగప్రవేశం జరగనంత దాకా లైంగిక చర్యే జరగలేదని ప్రకటించడం, (నిన్నటి దాకా రేప్ చట్టం కూడా అంగప్రవేశం జరగకపోతే అత్యాచారం జరగనట్టే అని చెప్పింది) అది జరగనంత
వరకూ సమాజ మర్యాదకు విఘాతం కలగదనీ, ఆ లైంగిక చర్య బహిరంగంగా జరగనంత దాకా ఇబ్బంది లేదనీ భావించడం ఒక స్వీయ వంచన. ఇక్కడ సమస్య ఏ మోతాదులో జరిగితే ఏ స్థాయిలో ప్రదర్శన జరిగితే అది ప్రమాదకరం అనేది కాదు. ఎన్ని మార్గాల్లో మానవ శరీరాన్ని అవయవాలుగా కుప్పలు పోసి అమ్ముకుంటున్నది? అత్యంత వ్యక్తిగతమైన, జాతిని కొనసాగించే లైంగిక కార్యకలాపాల్ని బహిరంగంగా చిత్రీకరించి సొమ్ము చేసుకుంటున్నది అనేదే. దానితో పాటే ఈ రకరకాల 'ప్రదర్శనల్ని' చొంగలు కార్చుకుంటూ చూసే, పోర్నోగ్రఫీని రహస్యంగా చూసే వ్యవస్థకు మూల స్తంభాలైన నీతిమంతుల ద్వంద్వ ప్రమాణాలపై చర్చ కూడా ఇక్కడ తప్పనిసరి.

కుల సతుల శరీరాల్ని కాపాడేందుకు పతితుల వ్యవస్థలు అనివార్యం అనే వాదనలో పురుషుడి కోరికల దృష్టి నుంచే ప్రపంచాన్ని విశ్లేషించడం ఉంది. స్త్రీలు ఎవరయినా వారు మగాడి అవసరాల కోసమే అనే వ్యాఖ్యకు ఆమోదం ఉంది. ఒక పక్క ఈ వాదన చేస్తూనే మరోవైపు పతితలుగా బతకడం ఆ స్త్రీల స్వభావంగానో, ఎంపికగానో భావించేలా చేయడం ఈ తర్కంలోని పరస్పర విరుద్ధమైన విశిష్టత. స్త్రీ శీలాన్ని ఒకే పురుషుడికి పరిమితం కావడమే పాతివ్రత్యంగా పవిత్రతగా పరిమితం చేయడానికి కారణం రక్త స్వచ్ఛత, కుల స్వచ్ఛత, వంశ పారంపర్యతే. వాటి

తాలూకు ఆస్తి సం బంధాలు, ఆధిపత్య సంబంధాల కొనసాగింపే తప్ప వేరు కాదు. సాంకేతికంగా అంగప్రవేశం జరిగిన తర్వాతే.. గర్భందాల్చే అవకాశం ఉంటుంది కనుక ఆ ఒక్కటీ జరక్కపోతే శీలానికి ప్రమాదం లేనట్టే. కనుకనే స్త్రీ శరీరాన్ని వ్యాపార వస్తువుగా అన్ని రకాలుగా ప్రదర్శనల్లో అమ్మడం వృత్తిగా ఆమోదం పొందింది (అది కార్పొరేటు వ్యాపారానికి ఒక తప్పనిసరి అవసరం కూడా). కానీ వ్యభిచారం, పోర్నోగ్రఫీ వంటి లైంగిక చర్యల్ని నీతి బాహ్యంగా నిలబెట్టింది. వీటిని నివారించడం కష్టసాధ్యం అన్నట్లుగా కూడా ప్రవర్తిస్తుంది ఈ పాలకవర్గం. చాలా ఉదారంగా ఈ సదరు వృత్తులన్నీ వ్యక్తుల ఎంపికలే తప్ప పాలకుల బాధ్యత లేనట్టుగా చిలక పలుకులు పలుకుతుంటారు. సినిమాల్లోనూ మోడల్స్‌గానూ, డబ్బులు, గ్లామర్ వస్తాయనే భ్రమలు కలిగించడం వల్లనే వ్యక్తిగత ఎంపికతో దాన్ని వృత్తిగా చేసుకోవాలనే తపనతో వేలాది మంది అమ్మాయిలు శలభాలై కాలి పోతుంటారు. కడుపు నింపుకోవడానికి ప్రత్యామ్నాయం లేకపోవడం చేతనే వ్యభిచారంలో స్త్రీలు కొనసాగుతుంటారు. ఈ రెండింటి నీచ కలయికగా పోర్నోగ్రఫీని ఒక వృత్తిగా వ్యక్తిగత ఎంపిక చేసుకోవాలనే విశాల భావనలో మర్మం ఏమిటి?

'నా శరీరం నా ఇష్టం. అమ్ముకుంటాను ప్రదర్శించుకుంటాను. శృంగారం చేసి దాన్ని సినిమాగా చూపుతాను' అనే అమ్మాయిలు నిజంగా ధైర్యంగా వ్యక్తిగత ఎంపికలో భాగంగా వృత్తి ఎంచుకుంటుంటే దానిని స్త్రీ స్వేచ్ఛగా భావించి అందరూ దాన్ని ఆహ్వానించాలి కదా అంటాడీ నందర్శకుడు. దోపిడీ సమాజంలో ఏ వృత్తి సహజమైన, ఇష్టమైన ఎంపికగా ఉండదు. ఈ సందర్భంలో అది పూర్తిగా ప్రక్కదార్లు పట్టిన ఎంపిక. ఎందుకంటే అది నిజానికి ఒక ఎంపిక కాదు. డబ్బు కోసం శరీరాన్ని సరుకుగా అమ్ముకోవచ్చనే కార్పొరేటు భావజాలానికిది ప్రతిధ్వని. తన వ్యాపార అవసరాల కోసం స్రీ అవయవాల్ని అమ్ముతాను అంటే అది 'పెట్టుబడి నీతి బోధనలు కూడా అతిక్రమించినట్టే కాబట్టి శరీరాల్ని అమ్ముకునే అవసరం కలిగించడం దానికి గ్లామర్, డబ్బు జోడించడం ద్వారా ఈ అమ్మకాన్ని అనివార్యత నుంచి వ్యక్తిగత ఎంపికగా బదిలీ చేస్తుంది. తర్వాత అది చాలా అమాయకంగా ఏమీ ఎరుగనట్టుగా ఈ వ్యక్తిగత ఎంపికల స్వేచ్ఛను సమర్థిస్తుంది. దీనికి అత్యాధినికులూ ఉదారవాదులైన స్త్రీల మద్దతు కూడా ఉంటుంది. ఈ సదరు దర్శకుడు వ్యక్తిగత ఎంపికగా తన తల్లికి ఈ స్వేచ్ఛనిచ్చి, ఆమెతో తానే ఓ బూతు సినిమా తీసి, 'ప్రోత్సహిస్తాడా? ఏమో..! అలా చేసినా ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ఈనాటి కార్పొరేటు వికృత చేష్టలకు హద్దులేవీ లేవు. దీనికి మరో ఉదాహరణ సరోగసి. దరిద్రులు, ఒంటరి స్త్రీలకు ఉపాధి అవకాశాలు లేక కుటుంబ అవసరాలకు అద్దె గర్భాలుగా మారే దారి చూపడం. ఆ దారి సంతానలేని వారికి ఈ అద్దె గర్భాలు 'త్యాగంతో ఇచ్చే వరంగా ప్రచారం చేయడం. చివరికది వ్యక్తిగత ఎంపికగా

నిర్బందించడం.. ఇదీ డ్రామా. రైతులకు కిడ్నీలు, కాలేయాలు అమ్ముకునే పరిస్థితి కల్పించడం. దానిని.. పాపం చనిపోతున్న (ధనికులు) వారి ప్రాణాలు నిలబెట్టే త్యాగంగా చూపడం. ప్రతిచోటా వ్యక్తిగత ఎంపికే శరీరాన్ని ప్రదర్శనగా, అవయవాలుగా, లైంగిక చర్యలుగా అమ్ముకునే ఎంపిక పూర్తిగా వ్యక్తిగతమైనదేనా?

ఐటమ్ సాంగ్స్ చేసే ముమైత్‌ఖాన్.. దానికి తన కుటుంబ దరిద్రం కారణమని, దాన్నుంచి బయట పడగానే గౌరవ ప్రదమైన నటన చేస్తానని చెప్పింది. అంటే నటన అది ఒక సాధన చేస్తే వచ్చే నైపుణ్యం. శరీర ప్రదర్శన వైఫల్యం(నృత్యం నైపుణ్యమే) కాదని కూడా ఆమెకు తెలుసు. ప్రతి వృత్తి ఉత్పత్తికి ఉపయోగపడాలి. లేదా ఉత్పత్తికి సహకరించాలి (దీన్నే సేవారంగం అంటాం). వినోదం ఈ విభాగంలోకి వస్తుంది. ఈ రెండింటి వల్ల ఉత్పత్తి జరుగుతూ సక్రమంగా దానికి అనుగుణమైన సామాజిక సంబంధాలు ఉండాలి. వ్యభిచారం, పోర్నోగ్రఫీ లేదా అవయవాలను అతిగా ప్రదర్శించి, వస్తువులు అమ్మడంలో స్త్రీలు కలిగి ఉండాల్సిన నైపుణ్యం ఏమిటి? శృంగార కళ మగాడిని సంతృప్తి పరిచే నైపుణ్యం అని జవాబు చెప్పవచ్చు కానీ.. అవేమీ నిజానికి ఇక్కడ అవసరం లేదు. పొంకంగా ఉన్న శరీరాన్ని తమది కాదని అప్పగించేస్తే చాలు. దీని వల్ల ఏం జరుగుతుంది? అసహజ చేష్టలు, మితిమీరిన వాంఛలు సామాజిక శాంతికి ప్రమాదకరంగా మారతాయి. ఇప్పటికే మారాయి. అవి పెరుగుతున్నాయి కూడా. హత్యలు చేసే నైపుణ్యం గల వారికి ఈ వాదన ప్రకారం అయితే హత్యలను వృత్తిగా ఎంచుకునే అవకాశం ఉండాలి కదా!.

అన్ని రకాల హింసలకీ శరీరాన్ని అప్పగించడం రెండు సందర్భాల్లో జరుగుతుంది. తన శరీరంపై ఏ అధికారం లేనప్పుడు. అంటే బానిసత్వంతో లేదా బతుకు అంతకంటే చిత్రహింసగా మారినపుడు. ఈ బూతు చిత్రాల తారలెవరు? యమ కూపంలోకి తమ ప్రమేయం లేకుండా వచ్చి పడి, శరీరాన్ని విటుల వికృతానందాలకు అప్పగించాక శరీరంపై ప్రేమ నశించి, ఆత్మాభిమానం కోల్పోయి, ఏం జరిగినా ఇంతకంటే ఏ ఉంటుందనే నిరాసక్తతతో లైంగిక చర్యల చిత్రీకరణతో బ్లాక్ మెయిల్ పాలై, నిస్సహాయంగా ఆ సాలె గూడులో చిక్కుకుని, బయటపడే దారిలేని వారు. కొన్ని అలవాట్లకి బానిసై, ఒంటిపై స్పృహ కోల్పోయిన వారు. ఇంకా సినీమాయా లోకపు చివరి అంచుల్లో నివశించే ఎక్స్ట్రాలు. అప్పటికే వారి వ్యక్తిగత అనుమతితో మేకప్ మేన్ దగ్గర్నుండి, దర్శకుల దాకా(అవకాశాల ఆశ చూపి) చెయ్యి వేసే ఉంటారు. రాజకీయ నాయకులు, అధికారులు, పోలీసు, న్యాయ యంత్రాంగాల సభ్యులు, గౌరవ ప్రతినిధుల్లో అనేకులు సినీతారల గ్లామర్ శరీరాలకై తహతహ లాడుతూ వీరితో తమ తృష్ణను చల్లార్చుకుంటారు. ఇంక 'మంచి' నటనా అవకాశాల ఎండమావి దాహం తీర్చదని అర్థమై, ఏదో ఒక బలహీనతతో బూతు తారలుగా నిలుస్తారు. ఇవన్నీ

### నిజానికి వ్యక్తిగత ఎంపిక లేనా?

ఒకవేళ నిజంగా ఎవరయినా తమ శరీరాల్ని అమితమైన లైంగిక హింసకు, దాని ప్రదర్శనకూ వేదికగా చేస్తామంటే అది మతిలో ఉండి, చేసిన నిర్ణయంగా, భావించగలమా? అట్లా అయితే ఆత్మహత్యను కూడా ఒక ఎంపికగా భావించి, వదిలేయాలి.

అసలు స్త్రీ-పురుషుల శారీరక సంబంధాలు ఆకర్షణ, మోహం, ప్రేమ అనే మానవ అనుభూతులతో నిండి ఉన్నాయి. ఆరోగ్యకరమైన మనసు, శరీరం గల వారికి కృత్రిమ ప్రేరణల అవసరం ఉండదు. తమకు ఇష్టం అయిన వారి ద్వారానే లైంగిక తృప్తి పొందడం ఒక హక్కు. అది సమాజ అవసమైన పునరుత్పత్తితో ముడిపడి ఉంది. స్త్రీల పునరుత్పత్తి హక్కులూ స్త్రీల లైంగికత్వంపై స్వీయ నియంత్రణ మానవ హక్కుల్లో భాగమే. లైంగిక అవసరాలు తీర్చుకోవడం, సంతానోత్పత్తి చేయుడం రెండూ స్త్రీ-పురుషుల 'సమ' సంబంధాలతో జతకలిస్తే అది ఆధునికత.

మానవ శరీరాన్ని, అవయవాల్ని ఏ రూపంలో వర్తకం చేసినా అది నేరమే. శరీరాన్ని అంగట్లో సరుకుగా వ్యాపార వస్తువుగా ప్రదర్శించడానికీ, బానిసల్ని విక్రయించే సంతల్లో బానిస వ్యాపారులు బానిసల నగ్న అవయవాల్ని కర్రలతో పొడిచి, నాణ్యత చూపడానికీ తేడా ఏముంది!. స్త్రీల గర్భాశయం అద్దెకు ఇవ్వడం ఒక ఉపాధి ఎందుకు కారాదో.. అందుకు స్త్రీ-పురుషుల లైంగిక చర్యల బూతు చిత్రాల వృత్తి కారాదు. కిడ్నీలు, కాలేయాలు అమ్ముకోవడం ఒక వృత్తిగా ఎందుకు కుదరదో.. పూర్తి గోప్యత అవసరమైన వ్యక్తిగత చర్య అయిన సంగమం బహిరంగం ఉపాధిగా అందుకే కుదరదు.

ఇది మానవ మనుగడకూ, నాగరికతకూ, సంస్కారానికి ఒక కీలక అంశం. మానవత్వం గల రక్తకణాల్లో అనివార్యంగా ఆవహించాల్సిన ప్లాస్మా, శరీరాలు, అవయవాలు ప్రదర్శించేవే! అమ్మకపు సరుకులు కావు. ఆడ, మగల శారీరక కలయికలు, ఉద్రేకాలు రెచ్చగొట్టే వికృత వినోద వృత్తి కాదు. అది ప్రవృత్తి. వ్యభిచారం, బూతు చిత్రాలు వృత్తులుగావు.. దోపిడీ సమాజపు నికృష్ట చేష్టలు. కట్టు బానిసత్వాలు. రానున్న ప్రజాకాలంలో బానిసత్వాలకు తావు లేదు. ఈ దోపిడీ, సాంకేతిక విరాట్ స్వరూపం ఎన్ని ఉదార వాదనల ముసుగుల్లో ఈ వాదన ముందుకు తెచ్చినా, నిజమైన మానవ వివేచనా సేచ్ఛను ఎంపిక చేసుకుని, అంతిమంగా మానవ సమాజం దాన్ని తిరస్కరించాల్సిందే.



**దేవి**
సాంస్కృతిక కార్యకర్త,
హైదరాబాద్